# పెన్ పవర్

9th HAPPY ANNIVERSARY

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 1 సంచిక : 15 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు శనివారం 3 ఆగస్టు 2024 వెల : 5/-రూ॥

VOLUME :1 ISSUE : 15 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGLE SAT 3 AUGUST 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur



# పథకాల అమలే కాదు..
# ఫలితాలు రాబట్టాలి

## ఏడాదిలోపే సాధించేలా ప్రణాళిక ఉండాలి

### అంగన్వాడీల్లో మౌలిక వసతులపై దృష్టి పెట్టండి

### అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

### మహిళా శిశు సంక్షేమం పై సీఎం చంద్రబాబు సమీక్ష



**పెన్ పవర్ డెస్క్:** ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరిన సంగతి తెలిసిందే. సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి పై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు పలు కీలక శాఖలపై నేడు (శుక్రవారం) సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నారు. విద్యుత్, ఎక్సైజ్, పౌరసరఫరాల, మహిళా శిశు సంక్షేమ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష చేపట్టారు. సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశానికి మంత్రి సంధ్యారాణి మహిళా శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. అంగన్వాడీ కేంద్రాలు, మహిళా సాధికారత, మాతా శిశు మరణాలు, గర్భిణీ మహిళలు, బాలింతలకు అమలవుతున్న పథకాలు, పిల్లలకు పౌష్టికాహారం అందించే పథకాల పై అధికారులతో చర్చిస్తున్నారు.

# సీఆర్డీఏ పరిధి 8,252 చ.కి.మీ ఉండేలా నిర్ణయించాం

### సీఎం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీఏ సమావేశం

### మీడియాకు వివరాలు తెలిపిన మంత్రి నారాయణ

### కోర్ క్యాపిటల్ పరిధి తిరిగి 217 చ.కి.మీ ఉండేలా నిర్ణయం

### సీఆర్డీఏ కోసం 32 మంది కన్సల్టెంట్ల నియామకంపై నిర్ణయం

### న్యాయ పరిశీలన తర్వాత ఆర్-5 జోన్ పై కార్యాచరణ

### అమరావతిని అనుసంధానిస్తూ కృష్ణా నదిపై 6 ఐకానిక్ బ్రిడ్జిలు

**పెన్ పవర్ డెస్క్:** సీఎం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీఏ సమావేశం ముగిసిన అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. రాజధానిలో సోమ, మంగళవారాల్లో జంగిల్ క్లియరెన్స్ ప్రారంభించామని చెప్పారు. రాజధానిలో భూములు తీసుకున్న సంస్థలను సంప్రదిస్తామని, ఆయా సంస్థలు తమ కార్యాలయాల ఏర్పాటుకు గడువును మరో రెండేళ్లకు పెంచామని వెల్లడించారు. హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టును తిరిగి ప్రారంభించాలని నేటి సమావేశంలో నిర్ణయించామని మంత్రి నారాయణ తెలిపారు. సీఆర్డీఏలో 778 మంది ఉద్యోగులను

వివరాలు 2లో..



## హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

- త్వరలో క్రీడా పాలసీ... హర్యానా రాష్ట్ర విధానాన్ని పరిశీలిస్తున్నామన్న సీఎం
- సిరాజ్‌కు విద్యార్హత లేకపోయినప్పటికీ గ్రూప్ 1 ఉద్యోగం ఇస్తున్నట్లు వెల్లడి
- భూమి ఉంటే మండలానికో మినీ స్టేడియానికి నిధులు ఇస్తామన్న సీఎం

వివరాలు 2లో..





## అమరావతి రైతులకు శుభవార్త చెప్పిన ఏపీ ప్రభుత్వం

- నిన్న సీఎం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీఏ సమావేశం
- అమరావతి రైతులకు మరో ఐదేళ్లు కౌలు చెల్లించాలని నిర్ణయం
- నాడు అమరావతి కోసం 30 వేల ఎకరాలు ఇచ్చిన రైతులు
- పదేళ్ల పాటు వారికి కౌలు చెల్లించాలని నాటి ప్రభుత్వం నిర్ణయం
- పదేళ్ల గడువు ముగియడంతో, మరో ఐదేళ్లకు పొడిగించాలని నిన్న సమావేశంలో నిర్ణయం





వివరాలు 2లో..

## శ్రీశైలం ప్రాజెక్టుకు భారీ వరద..
## 10గేట్లు ఎత్తి నీటి విడుదల



**పెన్ పవర్ డెస్క్:** శ్రీశైలం జలాశయానికి జలకళ సంతరిం చుకుంది. ఎగువన కురుస్తున్న భారీవర్షాలకు శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వచ్చి చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టుకు 4లక్షల 89వేల361 క్యూసెక్కుల

వివరాలు 2లో..

## నీట్ యూజీ పరీక్ష లీకేజీపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ లోపాల వల్లనే లీకేజీ
- పరీక్ష రద్దు అవసరం లేదని గతంలోనే తీర్పు ఇచ్చిన సుప్రీం కోర్టు
- తక్షణమే లోపాలను సరిదిద్దుకోవాలన్న ధర్మాసనం




**పెన్ పవర్ డెస్క్:** నీట్ యూజీ పరీక్షల లీకేజీపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం (శుక్రవారం) కీలక వ్యాఖ్యలు చేసింది.

వివరాలు 2లో..

## గతంలో ఎప్పుడూ లేదు...
## ఒక్కరోజులోనే 97.54 శాతం మందికి పెన్షన్లు అందించాం

- మొన్న ఆగస్టు 1న ఏపీలో సామాజిక పెన్షన్ల పంపిణీ
- 64 లక్షల మందికి రూ.2,737 కోట్ల పంపిణీ
- ఈ కార్యక్రమం ఎంతో సంతృప్తినిచ్చిందన్న సీఎం చంద్రబాబు
- ఉద్యోగులకు జీతాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు కూడా మొన్ననే ఇచ్చామని వెల్లడి



వివరాలు 2లో..

## వయనాడ్ వరద బాధితులకు ఇండ్లు కట్టిస్తాం

- వాయనాడ్‌లో కాంగ్రెస్ 100 ఇళ్లను నిర్మిస్తుంది: రాహుల్ గాంధీ
- మొన్నటి నుంచి తాను వాయనాడ్‌లోనే ఉన్నానన్న రాహుల్ గాంధీ
- మొన్న ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లానని వెల్లడి
- నిన్న పంచాయతీ అధికారులతో సమావేశమై ప్రమాద వివరాలు తెలుసుకున్నట్లు వివరణ



**పెన్ పవర్ డెస్క్:** వయనాడ్ వరద బాధితులను ఆదుకునేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ. ల్యాండ్ స్లైడ్స్ కారణంగా విధ్వంసానికి గురైన వయనాడ్ పరిధిలోని చురాల్ పరా, వెలారిమలా, ముండక్కయిలీ, పంచిరిమడోమ్ ప్రాంతాల్లో గత రెండు రోజులుగా రాహుల్ గాంధీ పర్యటిస్తున్నారు. శుక్రవారం ఆగస్టు 2,2024 కూడా ల్యాండ్ స్లైడ్ తో ధ్వంసమైన గ్రామాల్లో పర్యటించారు. పునరావాస కేంద్రాలను సందర్శించి బాధితులను పరామర్శించారు. స్థానిక అధికారులను కలుసుకొని నష్టం అంచనా వేశారు.

వివరాలు 2లో..

## కర్ణాటక గవర్నర్ పై సీఎం సిద్ధరామయ్య ఎదురుదాడి

- ‘ముడా’ వ్యవహారంలో సిద్ధరామయ్యకు రాజ్ భవన్ షోకాజ్ నోటీసులు
- కేంద్రం చేతిలో గవర్నర్ కీలుబొమ్మలా మారారన్న సిద్ధరామయ్య
- తప్పు చేయలేదు కాబట్టి తానేమీ భయపడబోనని స్పష్టీకరణ

వివరాలు 2లో..



## ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైసీపీ అభ్యర్థిగా బొత్స ఎంపిక

- ఆగస్టు 30న ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక
- ఈ నెల 6న నోటిఫికేషన్ విడుదల
- వైసీపీ నేతల అభిప్రాయాలు తెలుసుకున్న అనంతరం బొత్స పేరు ప్రకటించిన జగన్

వివరాలు 2లో..



## మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్ట్



**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ కీలక నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్ట్ అయ్యారు. గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో ఆయన్ను పోలీసులు శుక్రవారం గన్నవ రంలోని ఆయన నివాసంలోనే అదుపులోకి తీసుకు న్నారు. మరోవైపు వంశీ హైదరాబాద్ నుంచి అమెరి కా

వివరాలు 2లో..

# సంపాదకీయం

## వేలి ముద్రలు చూసి ఎలాంటి వారో చెప్పొచ్చు..

ఫేస్ రీడింగ్... హస్తసాముద్రికం... పుట్టిన తేది... పేరు.. ఇలా అనేక రకాలుగా మనిషి వ్యక్తిత్వం...స్వభావం.. జీవితంలో జరిగే మంచి చెడులను జ్యోతిష్యనిపుణులు అంచనా వేసి చెబుతుంటారు. అయితే ఇప్పుడు వేలిముద్రల ఆధారంగా కూడా వ్యక్తిత్వం..వారు ఎలాంటి వారు.. ఏవిధంగా ప్రవర్తిస్తారో తెలిసిపోతుందని కొంతమందిఅంచనా వేస్తున్నారు.

వేలిముద్రలు.. మన ఐడెంటిటీని చెప్పడంలో ప్రధాన పాత్రను పోషిస్తాయి. ఏ ఇద్దరు వ్యక్తుల వేలిముద్రలు ఒకేలా ఉండవు. ఆర్థిక లావాదేవీలైనా, క్రైమ్ సంబంధిత అంశాలైనా కూడా ఒక నిర్దోషిని గానీ.. ఒక నేరస్థుడిని పట్టుకోవడంలో వీటినే ఆధారంగా చేసుకుంటారు నిపుణులు. మరి అలాంటి వేలిముద్రలు మీ గురించి ఏ విషయాలు చెబుతాయోనని మీరెప్పుడైనా ఆలోచించారా.? న్యూరోసైన్స్, జెనెటిక్స్, డెర్మటోగ్లిఫిక్స్, సైకాలజీ విభాగాల్లో జరిగిన కొన్ని పరిశోధనలు.. వేలిముద్రలు మన వ్యక్తిత్వాన్ని అంచనా వేయొచ్చునని తేలింది. వేలిముద్రలు అనేవి సాధారణంగా మూడు రకాలుగా విభజించబడ్డాయి. అవే లూప్స్, కర్వ్స్, వోర్ల్స్. ప్రతి రకం విభిన్న వ్యక్తిత్వ లక్షణాలను ప్రతిబింబిస్తాయని పరిశోధకుల అంచనా వేస్తున్నారు. ఇప్పుడు దాదాపుగా అన్ని కంపెనీలు.. ఎంప్లాయిస్? అటెండన్స్? కు కూడా %ఖీఱఅస్త్రవతీ జూఎజుఅతీవంంఱశీఅ% ను ఉపయోగిస్తున్నారు. కొన్ని కార్పొరెట్? స్కూళ్లలో విద్యార్థుల అటెండన్స్? కు కూడా ఈ పద్ధతినే ఉపయోగిస్తున్నారు. శంఖు ఆకారం(లూప్స్): ఈ ఆకారంతో వేలిముద్రలున్న వ్యక్తులు చాలా నెమ్మదస్తులు, అలాగే ప్రశాంతమైన స్వభావం కలిగినవారు. ఎప్పుడూ అందరికంటే వెనుక తాము ఉన్నామని ఆలోచించే వ్యక్తులు వీరట. మొదలుపెట్టే పని ఏదైనా కూడా.. వీరు కష్టపడుతూనే ప్రారంభిస్తారు. సానుభూతి వీరికున్న ఏకైక లక్షణం.. దీనితో స్నేహితులను సంపాదించుకుంటారు. నిజాయితీగా ఉన్నామంటూ డప్పుకొట్టుకుంటారు. ఎక్కువగా పగటికలలు, ఊహల్లో విహరిస్తుంటారు. వీరికి ఏ పనిలోనూ సంతృప్తి ఉండదు. ఎప్పుడూ బోర్ ఫీల్ అవుతుంటారు. అందుకే ఉద్యోగాలు కూడా ఎక్కువగా మారుతుంటారు.

వంపు గీతలు(కర్వ్): ఈ ఆకారంతో వేలిముద్రలున్నవారు చాలా ధైర్యవంతులు.. గుండె నిండా ఆత్మవిశ్వాసం కలిగి ఉండటమే కాదు.. ప్రతీ పనిలోనూ ఆచరణాత్మకంగా వ్యవహరిస్తారు. స్ట్రాంగ్ పర్సన్స్ కూడా వీరు. ఒక పని విషయంలో నిర్ణయం తీసుకున్నారంటే.. ఎవ్వరూ కూడా వీరిని దాని నుంచి తప్పించడం కష్టం. ఆచరించే నమ్మకాలైనా, స్నేహితులైనా.. అన్నింటా నిజాయితీగా ఉంటారు. సోమరితనం వీరికి ఉండదు. మారుతున్న ప్రపంచంతో వీరు ఎక్కువగా మారారు.వృత్తాకారం(వోర్ల్స్): ఈ ఆకారంతో వేలిముద్రలు ఉన్నవారు ఎక్కువగా ఒంటరిగా ఉండటానికి ఇష్టపడతారు. ఎక్కువగా రిజర్వ్ గా ఉండటమే కాదు.. వారికి నచ్చినట్టుగా పనులు చేయడానికి ఇష్టపడతారు. చుట్టూ ఉండే పరిస్థితులను తమ విజయానికి వినియోగించుకోవడం వీరికి వెన్నతో పెట్టిన విద్య..స్వార్థంతో పాటు కొంచెం స్వతంత్ర భావాలు.. అలాగే మనసులోని విషయాలను ఇతరులతో పంచుకోవడం లాంటివి వీరిలోని కొన్ని లక్షణాలు. వీరికున్న తెలివి, ప్రతిభ, అలాగే క్రియేటివ్ థాట్స్ విజయం వైపు వెళ్లేలా చేస్తాయి.

# సీఆర్డీఏ పరిధి 8,252 చ.కి.మీ ఉండేలా నిర్ణయించాం

- మొదటి పేజీ తరువాయి

నియయమించుకుంటామని పేర్కొన్నారు. అంతేకాకుండా, సీఆర్డీఏ కోసం 32 మంది కన్సల్టెంట్లను నియమించుకోవడానికి నిర్ణయం తీసుకున్నట్టు వివరిం చారు. ముఖ్యంగా... 8,352.69 చదరపు కిలోమీటర్ల పరిధిలో సీఆర్డీఏ ఉండేలా నిర్ణయం తీసుకోవడం జరిగిందని, అదే సమయంలో కోర్ క్యాపిటల్ పరిధి తిరిగి 217 చదరపు కిలోమీటర్లు ఉండేలా నిర్ణయం తీసుకున్నామని నారాయణ చెప్పారు. సీడ్ క్యాపిటల్ నిర్మాణంపై సింగపూర్ ప్రతినిధులను సంప్రదిస్తామని వెల్లడించారు.
నాలుగు లేన్లుగా కరకట్ట నిర్మాణం చేపడతామని, అమరావతికి ఓఆర్ఆర్, ఈఆర్ఆర్ ఉంటాయని వివరించారు. అమరావతిని అనుసంధానిస్తూ కృష్ణా నదిపై 6 ఐకానిక్ బ్రిడ్జిలు నిర్మిస్తామని తెలిపారు.

ఇక, న్యాయ పరిశీలన తర్వాత ఆర్-5 జోన్ పై కార్యాచరణ ప్రారంభించాలని నేటి సీఆర్డీఏ సమావేశంలో నిర్ణయించినట్టు మంత్రి నారాయణ పేర్కొన్నారు. రాజధాని అమరావతిలో స్టార్టప్ ఏరియా నిర్మాణంపై సింగపూర్ ప్రభుత్వాన్ని సంప్రదిస్తామని అన్నారు.

## వయనాడ్ వరద బాధితులకు ఇండ్లు కట్టిస్తాం

- మొదటి పేజీ తరువాయి

ఈ భారీ విధ్వంసంలో నిర్వాసితులైన వారిని ఇండ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు.
వయనాడ్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయనున్న కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్ లో పర్యటించారు. పంచిరిమడోమ, ముండకయిలీ ప్రాంతాలతోపాటు రీలిఫ్ క్యాంపులను సందర్శించారు. నేను గత రెండు రోజులుగా వయనాడ్ లో పర్యటిస్తున్నారు.. ఇది భయంకరమైన విపత్తు.. నిన్న వరద బాధిత ప్రాంతాలకు వెళ్లాను. రిలీఫ్ క్యాంపులను సందర్శించాం. నష్టాన్ని అంచనా వేశాం.. ఇవాళ శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించి.. మృతుల సంఖ్య, గల్లంతయిన వారి ఆచూకీ , ఆస్తి నష్టం వంటి వివరాలను తెలుసుకున్నాం.. అధికారుల లెక్కల ప్రకారం వందలాది ఇండ్లు ధ్వంసమయ్యాయి. వయనాడ్ వరద బాధితులను ఆదుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుంది. ఈ భయంకర విపత్తులో ఇండ్లు కోల్పోయినవారికి 100 ఇండ్లు కట్టిస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు.
మరోవైపు వయనాడ్ వరద విపత్తులో ఇప్పటివరకు 302 మంది చనిపోయినట్లు అధికారులు ప్రకటించారు 206 మంది ఆయూకీ ఇంకా లభించలేదు. 1500 మంది రెస్క్యూ సిబ్బంది వరద బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొన్నారు. చురాల్ పరా, వెలారిమలా, ముండక్కయిలీ, పంచిరిమడోమ్ వంటి ల్యాండ్ స్లైడ్ ప్రభావ ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## శ్రీశైలం ప్రాజెక్టుకు భారీ వరద.. 10గేట్లు ఎత్తి నీటి విడుదల

- మొదటి పేజీ తరువాయి

ఇన్ ఫ్లో ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా..ప్రస్తుతం రిజర్వాయర్?లో 883.30 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటి నిల్వ 215.8070 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 206.0996 టీఎంసీలకు చేరింది. కుడిగట్టు, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

## హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

**పెన్ పవర్ డెస్క్:**క్రీడల విషయంలో హర్యానా రాష్ట్రం విధానాన్ని పరిశీలిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రకటించారు. బాక్సర్ నిఖత్ జరీన్, క్రికెటర్ సిరాజ్‌లకు డీఎస్పీ ఉద్యోగాలు ఇచ్చేందుకు ఉద్దేశించిన బిల్లుపై శాసనసభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... త్వరలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌ను బ్యాగరికంచెకు షిఫ్ట్ చేయాలని భావిస్తున్నామన్నారు. అక్కడే స్కిల్ యూనివర్సిటీ పక్కన మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంను నిర్మించనున్నట్లు చెప్పారు. ఇందుకోసం బీసీసీఐతో చర్చించామన్నారు. అంతర్జాతీయస్థాయి క్రికెట్ స్టేడియాన్ని నిర్మించాలని బీసీసీఐని కోరామని, వారు కూడా అందుకు ముందుకు వచ్చారన్నారు. స్పోర్ట్స్ కోసం నిధులతో పాటు ప్రత్యేక కార్యాచరణ ఉంటుందన్నారు.క్రీడాకారులను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తామన్నారు. నిఖత్ జరీన్‌కు ఆర్థిక సాయం చేసినట్లు చెప్పారు. సిరాజ్‌కు విద్యార్హత లేకపోయినప్పటికీ గ్రూప్ 1 ఉద్యోగం ఇస్తున్నట్లు చెప్పారు.రానున్న అసెంబ్లీ సమావేశాలల్లో స్పోర్ట్స్ పాలసీని ప్రవేశ పెడతామన్నారు. స్పోర్ట్స్ స్టేడియంల ఏర్పాటును ప్రోత్సహించే అంశంపై దృష్టి సారించామన్నారు. బీజేపీ సభ్యుడు చెప్పినట్లు మండలానికి ఓ మినీ స్టేడియం నిర్మిస్తే ఉపయోగంగా ఉంటుందన్నారు. కానీ తెలంగాణలో భూముల విలువ బాగా పెరిగి.. ప్రభుత్వ భూములు కబ్జాలకు గురయ్యాయన్నారు. చాలా ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు లేకుండా పోయాయన్నారు. ఏ మండల కేంద్రంలోనైనా ప్రభుత్వ భూమి ఉంటే స్టేడియం నిర్మాణానికి బడ్జెట్ కేటాయించేందుకు తాము సిద్ధమన్నారు.
యువతను వ్యసనాల నుంచి బయటకు తీసుకురావడానికి క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, ఈ సభపై ఆ బాధ్యత ఉందన్నారు. సభ్యులు సూచనలు, సలహాలు ఇస్తే క్రీడావిధానానికి పరిశీలిస్తామన్నారు.
యూసఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కరరెడ్డి స్టేడియం సినిమా ఫంక్షన్లకు అంకితమైతే, గచ్చిబౌలిలోని స్టేడియం పెళ్లిళ్లు, పేరంటాలకు, సరూర్ నగర్ స్టేడియం, ఎల్బీనగర్ స్టేడియం రాజకీయ పార్టీల సమావేశాలకు ఉపయోగిస్తున్నారన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకే బడ్జెట్‌లో క్రీడల కోసం రూ.321 కోట్లు కేటాయించామన్నారు.

## అమరావతి రైతులకు శుభవార్త చెప్పిన ఏపీ ప్రభుత్వం

**పెన్ పవర్ డెస్క్:** ఏపీ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ రాజధాని అమరావతి రైతులకు శుభవార్త చెప్పారు. రాజధాని అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులకు మరో ఐదేళ్ల పాటు కౌలు చెల్లించాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు.
సీఎం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీఏ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి నారాయణ కూడా హాజరయ్యారు. సమావేశం ముగిసిన అనంతరం ఆయన మీడియాకు వివరాలు తెలిపారు.
2014లో రాష్ట్ర విభజన అనంతరం ఏపీ ప్రభుత్వం అమరాతి రైతుల నుంచి రాజధాని కోసం 30 ఏకరాల భూమిని సేకరించింది. పదేళ్ల పాటు రైతులకు వార్షిక కౌలు చెల్లించాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పుడా పదేళ్ల గడువు పూర్తి కావడంతో,
నేడు సీఎం చంద్రబాబు సీఆర్డీఏ సమావేశంలో కౌలు అంశంపై చర్చించారు. అమరావతి రైతులకు వార్షిక కౌలును మరో ఐదేళ్లకు పొడిగించాలని నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి నారాయణ తెలిపారు. రైతు కూలీలకు మరో ఐదేళ్ల పాటు పింఛను చెల్లించాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

## ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైసీపీ అభ్యర్థిగా బొత్స ఎంపిక

**పెన్ పవర్ డెస్క్:**ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైసీపీ అభ్యర్థిగా బొత్స సత్యనారాయణ ఎంపికయ్యారు. ఈ మేరకు వైసీపీ అధ్యక్షుడు జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా వైసీపీ నేతల అభిప్రాయాలను తెలుసుకున్న అనంతరం జగన్ తమ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స పేరును ప్రకటించారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఆగస్టు 30న ఉప ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో... ఆగస్టు 6న నోటిఫికేషన్, అదే రోజు నుంచి ఆగస్టు 13 వరకు నామినేషన్ల స్వీకరణ, ఆగస్టు 14న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. ఆగస్టు 16 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. ఆగస్టు 30న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో... విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల మున్సిపల్ కార్పొరేషన్లు, జెడ్పీ, ఎంపీపీ సభ్యులు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయనున్నారు. సెప్టెంబరు 3న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

## గతంలో ఎప్పుడూ లేదు... ఒక్కరోజులోనే 97.54 శాతం మందికి పెన్షన్లు అందించాం

**పెన్ పవర్ డెస్క్:** (ఆగస్టు 1) ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీలో స్వయంగా పాల్గొన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దానిపై ఇవాళ ట్వీట్ చేశారు. 1వ తేదీనే ఇంటి వద్ద రూ.2,737 కోట్లతో 64 లక్షల మందికి పెంచిన పెన్షన్ల పంపిణీ ఎంతో సంతృప్తినిచ్చిందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనంతగా... కేవలం ఒక్కరోజు వ్యవధిలోనే రికార్డు స్థాయిలో 97.54 శాతం మందికి పెన్షన్లు పంపిణీ చేశామని వెల్లడించారు. "వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారుల ఆర్థిక భద్రత మా బాధ్యత. పెరిగిన పెన్షన్ ఆ పేదల జీవితాలకు భరోసానిస్తుంది. పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగస్వాములైన ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులకు, అందరికీ మనస్ఫూర్తిగా అభినందనలు. ప్రభుత్వ ఉద్యోగులు అంటే... ప్రభుత్వంలో భాగం, ప్రజలకు ఏ మంచి చేయాలన్నా వారే కీలకం. అలాంటి వర్గానికి కూడా 1వ తేదీనే జీతాలు అందేశాం. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు చెల్లించాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, అనేక సమస్యలు ఉన్నా రూ.5,300 కోట్లు విడుదల చేసి... వారికి దక్కాల్సిన జీతం 1వ తేదీనే చెల్లించాం.
రాష్ట్ర పునర్ నిర్మాణ కార్యక్రమంలో ఉద్యోగులు, అధికారుల పాత్ర ఎంతో కీలకం. ఉద్యోగులతో పని చేయించుకోవడమే కాదు, వారి సంక్షేమం గురించి ఆలోచించి, వారికి తగిన గౌరవం ఇచ్చే ప్రభుత్వం మాది. కలిసి కష్టపడదాం... రాష్ట్ర భవిష్యత్తును మారుద్దాం" అంటూ సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

## నీట్ యూజీ పరీక్ష లీకేజీపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

- మొదటి పేజీ తరువాయి

పేపర్ లీక్ కావడంతో పరీక్ష రద్దు చేయాల్సిన అవసరం లేదని గత నెలలోనే తీర్పు ఇచ్చిన సర్వోన్నత న్యాయస్థానం ..వాటి కారణాలు వెల్లడిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ లోపాల వల్లనే లీకేజీ జరిగిందని కోర్టు అభిప్రాయపడింది. పేపర్ లీకేజీలో ఎలాంటి వ్యవస్థీకృత ఉల్లంఘనలు జరగలేదని, పరీక్ష పవిత్రతను దెబ్బతీసే స్థాయిలో జరగలేదని ధర్మాసనం స్పష్టం చేసింది.ఝార?ండ్ లోని హజారీబాగ్, బీహార్ పాట్నా కేంద్రాల్లో మాత్రమే పేపర్ లీకేజీ జరిగిందని, దీనిపై సీబీఐ దర్యాప్తు కూడా జరుగుతున్నందున పరీక్ష రద్దు చేయాలని అనుకోవడం లేదని తెలిపింది. నేషనల్ టెస్టింగ్ ఏజన్సీలో కొన్ని లోపాలు ఉన్నాయనీ, ఆ సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలని చెప్పింది. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలని స్పష్టం చేసింది. ఇదే క్రమంలో పరీక్షల సంస్కరణల కోసం ఇస్రో మాజీ చీఫ్ కే రాధా కృష్ణన్ నేతృత్వంలో నియమించిన కమిటీకి ధర్మాసనం కీలక ఆదేశాలు ఇచ్చింది. ప్యానెల్ ను మరింత విస్తరించాలని సూచిస్తూ .. పరీక్ష విధానంలో లోపాలను చక్కదిద్దేందుకు అవసరమైన చర్యలపై సెప్టెంబర్ 30వ తేదీ లోగా నివేదిక అందజేయాలని స్పష్టం చేసింది. నివేదికను కమిటీ అందజేసిన అనంతరం వాటిలో అమలు చేసే అంశాలపై కేంద్ర ప్రభుత్వం, విద్యాశాఖ రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించింది.వైద్య విద్యలో ప్రవేశం కొరకు నీట్ యూజీ పరీక్షను మే 5న నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశంలోని 571 నగరాల్లో 4750 సెంటర్లలో పరీక్షలు జరగ్గా, 23 లక్షలకుపైగా విద్యార్థులు హాజరయ్యారు. పేపర్ లీక్ ఘటనతో పరీక్ష రద్దు చేయాలని దాఖలైన పిటిషన్ పై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం ఈరోజు తుది తీర్పు వెల్లడించింది.

## కర్ణాటక గవర్నర్ పై సీఎం సిద్ధరామయ్య ఎదురుదాడి

**పెన్ పవర్ డెస్క్:**మైసూర్ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (ముడా) ఇళ్ల స్థలాల కేటాయింపు వ్యవహారంలో రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ తనకు షోకాజ్ నోటీసులు పంపడం పట్ల సీఎం సిద్ధరామయ్య మండిపడ్డారు. గవర్నర్ కేంద్రం చేతిలో కీలుబొమ్మలా తయారయ్యారని, రాజ్ భవన్ ను కేంద్రం దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. సిద్ధరామయ్య నేడు మైసూరు ఎయిర్ పోర్టులో మీడియాతో మాట్లాడుతూ, "ఇలాంటి వాటికి నేనెందుకు భయపడాలి? తప్పు చేస్తే కదా నేను భయపడాలి? ముడా వ్యవహారంలోనే నేను ఎలాంటి తప్పిదాలకు పాల్పడలేదు. బహుశా ఈ వ్యవహారంలో విపక్షనేత ఆర్.అశోక భయపడాలి" అని వ్యాఖ్యానించారు. గవర్నర్ షోకాజ్ నోటీసులు పంపడంతో ముఖ్యమంత్రి వణికిపోతున్నారని విపక్ష నేత అశోక వ్యాఖ్యానించడంపై సిద్ధరామయ్య పైవిధంగా స్పందించారు. కాంగ్రెస్ నేతలను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడుతున్నారని సిద్ధరామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ మాజీ మంత్రులు శశికళ జోలే, మురుగేశ్ నిరానీ, జనార్ధనరెడ్డి వంటి వారిపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయని, వారిపై ఫిర్యాదులు గవర్నర్ కార్యాలయంలో ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్నాయని ఆరోపించారు. రాజ్ భవన్ ను కేంద్రం ఏ విధంగా ఉపయోగించుకుంటుందో చెప్పడానికి ఇదే ఉదాహరణ అని అన్నారు.

## మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్ట్

- మొదటి పేజీ తరువాయి

వెళ్లిపోయినట్లు వార్తలు విస్తృతమైన విషయం తెలిసిందే. ఈ పుకార్లన్నింటికీ చెక్ పెడుతూ ఆయన పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, గన్నవరం టీడీపీ ఆఫీసు ధ్వంసం కేసులో వంశీతో పాటు మొత్తం 18 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరిలో వంశీ మినహా మిగిలిన వారిని కోర్టులో హాజరుపర్చారు.

పెన్ పవర్
బాపట్ల । ప్రకాశం । నెల్లూరు



# రామాయపట్నం పోర్టు 2025 జూన్‌లోగా

# పూర్తి చేసేందుకు చర్యలు

### మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

### ఇకనుంచి ప్రతి నెల పోర్టు పనులపై సమీక్ష

### ఐదేళ్లలో నెల్లూరులో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి

### మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



కందుకూరు/ గుడ్లూరు పెన్ పవర్, ఆగస్టు 2: రామాయపట్నం పోర్టు పనులను వచ్చే ఏడాది జూన్ కల్లా పూర్తి చేస్తామని రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శుక్రవారం సాయంత్రం రామాయపట్నం పోర్టును సందర్శించారు. ముందుగా అధికారులతో సమీక్ష నిర్వహించి పనుల పురోగతిని తెలుసుకున్నారు. అక్కడే అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం నిర్మాణ పనులను పరిశీలించి మీడియాతో మాట్లాడారు.కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి, నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, జిల్లా కలెక్టర్ ఆనంద్, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాదరి, రాష్ట్ర ఉన్నతాధికారులు, పోర్టు అధికారులు పాల్గొన్నారు. బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు చంద్రబాబు చిరకాల వాంఛ అని, ఈ ప్రాంతాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో 2019లో చంద్రబాబు, మేజర్ పోర్టుకు శంకుస్థాపన చేశారని వెల్లడించారు. పోర్టు అంచనా వ్యయం 4,929 కోట్లు కాగా, ఇప్పటికీ 1100 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కేవలం 51 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయని చెప్పారు. మహాకూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పెండింగ్ ప్రాజెక్టులు, పోర్టులపై

తరువాయి 4లో..





# నీటిని క్లోరినేషన్

# తప్పని సరిగా చేయాలి

### -సర్పంచ్ తాటిపర్తి వనజ

**సింగరాయకొండ పెన్ పవర్, ఆగస్టు 2**

విషజ్వరాలు,దగ్గు తదితర సీజనల్ వ్యాధులను అరికట్టే చర్యలలో భాగంగా ప్రజలకు పంపిణీ చేసే నీటిని క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలని సింగరాయకొండ గ్రామ సర్పంచ్ తాటిపర్తి వనజ పంచాయితీ నీటి విభాగ సిబ్బందికి సూచించారు. గ్రామపంచాయతీ పంపు హౌస్ ను సందర్శించిన సర్పంచ్ వాటర్ డిపార్ట్మెంట్ సిబ్బందిని అడిగి ఎంత మోతాదులో క్లోరినేషన్ చేస్తున్నారు మొదలగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాటర్ డిపార్ట్మెంట్ సిబ్బంది సుధాకర్,కోటి రెడ్డి ,బిల్ కలెక్టర్ రామయ్య ,ప్రణయ్ పాల్గొన్నారు.

### కౌండిన్యనదిలో ఇసుక తెచ్చుకోవాలంటే

# వైసీపీనాయకులకు కప్పం కట్టాలా?

### వైసీపీ నాయకులకు అధికారం పోయినా తీరుమారదా?

### ప్రశ్నిస్తే దౌర్జన్యమంటారా?

### మాజీ సర్పంచ్ మురళి ధ్వజం





**పలమనేరు ఆగస్టు 01, (పెన్ పవర్):**

గృహ అవసరాలకు సమీపంలోని కౌండిన్య నదిలో ఇసుక తెచ్చుకోవాలంటే వైసీపీ నాయకులకు కప్పం కట్టాలా అని గంగవరం మాజీ సర్పంచ్ మురళి ప్రశ్నించారు. అధికారం కోల్పోయినా వైసీపీనాయకుల తీరు మారడంలేదని,ఇదే విషయాన్ని ప్రశ్నిస్తే తమపై దౌర్జన్యానికి వచ్చినట్లు చెప్పుకోవడమేమిటని ఆయన ధ్వజమెత్తారు. ఈమేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పాలసీని అనుసరించి ప్రజాప్రయోజనాలకు అవసరమైన ఇసుక కోసం గ్రామానికి సమీపంలోని కౌండిన్య నదిలోకి వెళ్లగా గంగవరం గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతి పరులైన హేమగిరి,పురుషోత్తం అనే ఇద్దరు వ్యక్తులు ఇది మా ఆధ్వర్యంలోని భూమి కాబట్టి ఇక్కడ ఇసుక తీసుకోవాలంటే డబ్బులు చెల్లించాలని, లేనిపక్షంలో తిరిగి వెళ్లిపోవాలన్నారు. ఇలాగే ఇసుక తీసుకొనేందుకు కిరణ్ కుమార్ రెడ్డి,బాలాజీ ల వద్ద నుండీ 1లక్ష,20వేల రూపాయలు వసూలు చేసినట్లు తెలిసింది. దీంతో గ్రామరెవెన్యూ అధికారుల ద్వారా సర్వే చేయగా ఇది పూర్తిగా నదికి సంబంధించిన భూమి అని,దీనిపై ఎవరి అజమాయిషీ లేదని తేల్చారు. కౌండిన్యనది భూమిని ఆక్రమించడమే తప్పు పైగా ఇసుక కోసం లక్షలాది రూపాయలకు అమ్మే అధికారం ఎవరికీ లేదు,ఇంత జరుగుతున్నా అధికారులు వీటిపై చర్యలు తీసుకోకపోవడం సరికాదని, ఇదే విషయంపై శనివారం పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు. ఆయనతో బాటు గంగవరం పంచాయతీ టీడీపీ కార్యదర్శి బాలాజీ, నాయకులు కిరణ్ కుమార్ రెడ్డి మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

### సముద్రపు నీటిలో కొట్టుకుపోతున్న

# వ్యక్తిని కాపాడిన పోలీసులు


### పోలీస్ సిబ్బంది స్పందించిన తీరు పట్ల హర్షం వ్యక్తం చేసిన యాత్రికులు

### యాత్రికులు పోలీస్ శాఖ సూచించిన నిర్దిష్ట లోతు వరకే వెళ్ళాలి.

### జిల్లా ఎస్పీ తుషార్ దూడి .

**పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్**
**బాపట్ల ఆగస్టు 2**





ప్రముఖ పర్యాటక ప్రదేశమైన బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్ లో శుక్రవారం అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోతున్న అచ్యుత్ మహేష్ (32) అను వ్యక్తిని సూర్యలంక అవుట్ పోస్ట్ లో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది, గజ ఈతగాళ్లు ప్రాణాలకు తెగించి కాపాడినారు. వివరాలలోకి వెళితే బాపట్ల పట్టణం న్యూ సాగర్ బజార్ కు చెందిన అచ్యుత్ మహేష్ (32) స్నేహితులతో కలిసి సూర్యలంక బీచ్ కు విహారానికి వచ్చినారు. అచ్యుత్ మహేష్ ఎక్కువ లోతుకు వెళ్లి మునుగుతూ ఉండగా ఇంతలో ఒక్కసారిగా వచ్చిన పెద్ద అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోతుండడంతో అది గమనించిన ఔట్ పోస్ట్ పోలీస్ సిబ్బంది, గజ ఈతగాళ్లు వెంటనే తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా సముద్రంలోకి వెళ్లి వ్యక్తి ప్రాణాలు కాపాడి ఒడ్డుకు తీసుకొని వచ్చినారు. తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా యాత్రికుడి ప్రాణాలు కాపాడిన పోలీస్ సిబ్బందిని, గజ ఈతగాళ్లను, యాత్రికుల రక్షణ కోసం పటిష్ట భద్రతాపరమైన చర్యలు తీసుకున్న జిల్లా ఎస్పీ తుషార్ దూడి ని యాత్రికులు అభినందించి కృతజ్ఞతలు తెలిపినారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యాత్రికుల రక్షణ కొరకు సూర్యలంక సముద్ర తీరంలో పటిష్ఠ చర్యలు తీసుకున్నామన్నారు. సముద్రం తీరం వెంబడి గజ ఈతగాళ్లను నియమించడం జరిగిందన్నారు. తీరం వెంబడి పోలీస్ సిబ్బంది, మెరైన్ పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సముద్రంలో నిర్దిష్ట లోతులో ఎరుపు రంగు జెండాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యాత్రికులు వాటిని దాటి సముద్రంలోకి వెళ్ళరాదన్నారు. అడ్రసింగ్ సిస్టం ద్వారా సముద్రంలో లోతుకు వెళుతున్న యాత్రికులను పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. అయితే కొంతమంది యాత్రికులు పోలీస్ శాఖ సూచనలను, ఆదేశాలను మీరి సముద్రంలో ఎక్కువ లోతులోకి వెళ్లడం వల్ల ఇటువంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. పోలీస్ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని యాత్రికులు ఎవరు మద్యం సేవించి సముద్రంలో మునగ వద్దని, నిర్దిష్ట లోతులో మాత్రమే మునగాలని ప్రజలకు సూచించారు. ప్రతి ఒక్కరు పోలీస్ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ సూచనలు యాత్రికుల భద్రత, రక్షణ కొరకు సూచించబడినవని తెలిపారు. తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా యాత్రికుడి ప్రాణాలను కాపాడిన పోలీస్ సిబ్బందిని, గజ ఈతగాళ్లను జిల్లా ఎస్పీ అభినందించారు.

# పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

**ఎన్నికల నిర్వహణపై ముందస్తుగా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి**

**ఈనెల 8వ తేదీ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 3:30 గంటలకు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలి**

**ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి**

**కొమరోలు ఎంఈఓ 2 బొర్రా వెంకటరత్నం**





**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 2**

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు సజవుగా ,ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కొమరోలు మండల విద్యాశాఖాధికారి2 బొర్ర వెంకటరత్నం ప్రధానోపాధ్యాయులను కోరారు. కొమరోలు మండలంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, కేజీబీవీ ,ఎయిడెడ్ విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయుల సమావేశం శుక్రవారం కొమరోలు లోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో నిర్వహించారు .ఆ కార్యక్రమానికి ఎంఈఓ 2 బొర్రా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. ఆ సందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ గతంలో ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీ పదవీకాలం ముగిసిందని, అందువల్ల అన్ని పాఠశాలలకు నూతన యాజమాన్య కమిటీని ఎన్నుకోవలసి ఉన్నదని వివరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆ మేరకు కొమరోలు మండలంలోని అన్ని యాజమాన్యాల పరిధిలో గల పాఠశాల యాజమాన్య కమిటీలకు నూతనంగా ఎన్నికలు నిర్వహించవలసి ఉన్నదని ఆయన తెలిపారు .ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజవుగా నిర్వహించేందుకు ప్రధానోపాధ్యాయులు ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు , గ్రామ పెద్దల సహకారంతో ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఎన్నికలు ఈనెల 8వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 వరకు నిర్వహించాలన్నారు. ఆ సందర్భంగా ముందుగా పాఠశాల యాజమాన్య కమిటీకి సభ్యుల ఎన్నిక జరగాలని, అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ల పదవులకు కూడా ఎన్నికలు నిర్వహించాలని ఆయన చెప్పారు. అనంతరం ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ ల తో ప్రమాణ స్వీకారోత్సవం కూడా నిర్వహించాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆయన ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఏవైనా సందేహాలు ,సమస్యలు ఉత్పన్నమైనచో తనను సంప్రదించాలని ఎంఈఓ 2 వెంకటరత్నం కోరారు .ఆ కార్యక్రమంలో అల్లినగరంలోని మునగనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి, ప్రభుత్వ హై స్కూల్ ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు అశ్విని కుమార్ ,రాజుపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు గర్రె శేఖర్ , రాజుపాలెం లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ ఎం రోజ్ సులోచన తోపాటు మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు , ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్ పి వెంకటేశ్వర్లు, సిఆర్పిలు రామాంజి, పుల్లయ్య, ఆంజనేయులు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రామాయపట్నం పోర్టు 2025 జూన్‌లోగా

# పూర్తి చేసేందుకు చర్యలు










ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారని, ఆయన ఆదేశాలతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, రామాయపట్నం పోర్టు, దగదర్తి ఎయిర్ పోర్టులను శుక్రవారం పరిశీలించినట్లు చెప్పారు. ఇకనుంచి ప్రతి నెల రామాయపట్నం పోర్టు పనులపై సమీక్ష చేస్తామని, అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడి వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తిస్థాయిలో పోర్టు నుంచి కార్యకలాపాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రామాయపట్నం పోర్టు విషయంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఐదు సంవత్సరాలలో రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులన్ని పూర్తిచేసేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, రామాయపట్నం పోర్టు పనులను ఏడాదిలోగా... దగదర్తి ఎయిర్పోర్ట్ పనులను తరువాత ఆరు నెలల్లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఇవన్నీ పూర్తయితే నెల్లూరు జిల్లాలో పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రాబోయే తరాల భవిష్యత్తు బంగారుమయమవుతుందని అన్నారు. పోర్టు ప్రారంభమైతే విదేశాలకు ఎగుమతులు దిగుమతులతో పాటు భారీ ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు అవుతాయని ఆనం తెలిపారు. నెల్లూరు జిల్లాలో ఆంధ్రప్రదేశ్ పటంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కొత్త ప్రభుత్వంలో పింఛన్లు అందించలేరని, జీతాలు సరిగా ఇవ్వలేరని... వైసీపీ నేతలు అబద్ధపు ప్రచారాలు చేశారని రామ నారాయణరెడ్డి విమర్శించారు. కానీ వాలంటీర్లతో సంబంధం లేకుండా ప్రభుత్వ ఉద్యోగులతో గురువారం 99% పింఛన్లు పంపిణీ చేశామని, రాష్ట్రవ్యాప్తంగా 2700 కోట్లు పింఛన్ల కోసం విడుదల చేసినట్లు వెల్లడించారు. గత ఐదేళ్లలో జరిగిన దానికి భిన్నంగా, సకాలంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు అందిస్తుండడం తమ ప్రభుత్వ గొప్పతనం అన్నారు. 12 లక్షల కోట్లు అప్పుచేసి రాష్ట్రాన్ని ముంచేసిన జగన్, కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక, ఇప్పటికే నాలుగు సార్లు పోర్టు పరిస్థితిపై ముఖ్యమంత్రి సమీక్ష చేశారన్నారు. ప్రభుత్వం ఏర్పాటు అయిన 55 రోజుల్లోనే మంత్రులను ఇక్కడికి పంపించి వాస్తవ పరిస్థితిని అంచనా వేస్తున్నారని చెప్పారు. కందుకూరు ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ హబ్ గా తయారు చేస్తామని, రామాయపట్నం పోర్టు పరిధిలో పారిశ్రామిక అభివృద్ధికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని గతంలో చంద్రబాబు, లోకేష్ హామీ ఇచ్చారని, అందుకు తగ్గట్లుగానే ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. పోర్ట్ కోసం భూములు ఇచ్చిన చేవూరు, రావూరు, కర్లపాలెం, సాలిపేట రైతులు ఇంకా ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుతం ఎకరాకు ఇస్తున్న 16 లక్షల నష్టపరిహారం సరిపోదని, దాన్ని 25 లక్షలకు పెంచాలని రైతుల కోరుతున్నారని ఎమ్మెల్యే మంత్రులు దృష్టికి తీసుకువెళ్లారు. రైతుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ఇద్దరు మంత్రులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. వెనుకబడ్డ కందుకూరు నియోజకవర్గం పట్ల, రామాయపట్నం పోర్టు పట్ల చంద్రబాబు చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధకు ఈ ప్రాంత ప్రజల తరపున ఆయనకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, కందుకూరు పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలు పరిరక్షిస్తా

**సిఐ కె.హజరత్తయ్య**




**సింగరాయకొండ పెన్ పవర్, ఆగస్టు 2**

తీర ప్రాంత, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సత్వర న్యాయం అందించడం పోలీస్ ప్రథమ ప్రాధాన్యం కావాలని, శాంతి భద్రతలను పరిరక్షించాలని సిబ్బందికి సింగరాయకొండ సిఐ కె.హాజరత్తయ్య పిలుపు ఇచ్చారు. సింగరాయకొండ సిఐ గా ఆయన శుక్రవారం భాద్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన తనను కలిసి పరిచయం చేసుకునేందుకు వచ్చిన సింగరాయకొండ, టంగుటూరు, జరుగుమల్లి ఎస్సై లు, సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సింగరాయకొండ ఎస్సై శ్రీ రాం తమ సిబ్బంది తో కలిసి ముందుగా సిఐ కి లాంఛనంగా స్వాగతం పలికారు. అదేవిధంగా టంగుటూరు ఎస్సై కూడా సిఐ కి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి మార్గదర్శనం చేస్తూ జిల్లా ఎస్పీ దామోదర్ మార్గదర్శనం లో ప్రజా పోలీసింగ్, సత్వర న్యాయం,పోలీస్ ప్రజా సంబంధాలు, నేరాల నివారణ, ముందస్తు సమాచారం, గంజాయి చెలామణి, నేరాలు, నేరస్తుల ముందస్తు సమాచారం సేకరిస్తూ ప్రతి ఒక్కరూ పోలీస్ గౌరవాన్ని కాపాడాలని సిబ్బందికి సూచించారు. ప్రజల, రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల ప్రజా ప్రతినిధుల తో సమన్వయం సహ కారం తో శాంతి భద్రతలు సజావుగా సాగేందుకు కృషి చెయ్యాలని సిఐ సిబ్బందిని కోరారు. సిఐ గా భాద్యతలు చేపట్టిన హాజరత్తయ్య ను పలువురు స్థానిక ప్రముఖులు, పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, కలిసి అభినందనలు తెలిపారు.

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

**ప్రభుత్వ వైద్యాధికారి గైనకాలజిస్ట్ డాక్టర్ గద్దె హేమ సుధ**




**పెన్ పవర్ పామూరు ఆగస్టు 2**

డబ్బా పాలు వద్దు తల్లిపాలు శిశువులకు శ్రేయస్కరం అని ప్రభుత్వ వైద్యాధికారి గైనకాలజిస్ట్ గద్దె హేమ సుధ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయ ఆవరణలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గద్దె హేమ సుధ మాట్లాడుతూ తల్లిపాలు శిశువులకు ఆరోగ్యం. తల్లిపాలు శిశువులకు అత్యంత సురక్షితం. శిశువులకు సంపూర్ణ పౌష్టికాహారం. బిడ్డకు ముఖ్యంగా తల్లిపాలు ఇవ్వాలి. అందువల్ల బిడ్డకు కావాల్సిన అన్ని పోషకాలూ–విటమిన్స్, మినరల్స్, ప్రోటీన్స్ లభిస్తాయి. పసిపిల్లలకు అవి ఎంతో శ్రేష్ఠమైనవి. తల్లి పాలు తాగితే పిల్లలు ఎంత బరువు ఉండాలో అంతే ఉంటారు. అధిక బరువు, అసలు బరువు లేకపోవడం వంటి సమస్యలు ఎక్కువగా రావు. తల్లిపాలు తాగుతూ పెరిగే పిల్లలకు భవిష్యత్తులో డయాబెటిస్, ఒబెసిటీ సమస్యలు రాకుండా ఉంటాయి. అందువల్ల ప్రతి తల్లీ, బిడ్డ పుట్టిన ఏడాదిన్నర పాటూ తన పాలు పట్టించడం ఎంతో మేలు.రోగనిరోధక శక్తి పెరుగుతుంది.సంపూర్ణ ఆరోగ్యంతో, చురుకుగా ఉంటారు.తల్లి బిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుంది. బిడ్డకు పాలు ఇచ్చే తల్లి కూడా బలమైన ఆహారం తీసుకోవాలి. ఆమె ఒత్తిడి లేకుండా సంతోషంగా ఉన్నప్పుడే, బిడ్డకు సరైన పాలు ఇవ్వగలదు. అందువల్ల తల్లి పోషకాలు ఉండే ఆహారం తీసుకోవాలి డాక్టర్ హేమ సుధా అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంగసాని లక్ష్మి, ఎంపీడీవో పి పుట్టారెడ్డి, సూపర్వైజర్ పద్మజ పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకేయూ వి.సి.ని మర్యాద పూర్వకంగా కలిసిన విశ్రాంత ప్రొఫెసర్లు...

**జ పుష్ప గుచ్ఛం ఇచ్చి, శాలువాతో ఘన సన్మానం..**

**స్టాఫ్ రిపోర్టర్,పెన్ పవర్,ఒంగోలు, ఆగస్టు,2**

ఆంధ్ర కేసరి యూనివర్శిటీకి నూతన వైస్ ఛాన్సలర్ గా ఇటీవల బాధ్యతలను స్వీకరించిన ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తిని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ రెక్టార్ ప్రొఫెసర్ వై.పి.రామ సుబ్బయ్య, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం లా విభాగం ప్రొఫెసర్ వి.ఆర్.సి. కృష్ణయ్య తదితరులు శుక్రవారం సాయింత్రం మర్యాద పూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా విశ్రాంత ప్రొఫెసర్లు బోకేను ఉప కులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తికి అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు.అనంతరం విశ్రాంత ప్రొఫెసర్లు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ఆంధ్ర కేసరి విశ్వ విద్యాలయం అభివృద్ధి కోసం గత కొంత కాలం నుంచి యూనివర్శిటీ అధికారులు, అన్ని శాఖల అధిపతులు, ఉద్యోగులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు.ఆంధ్ర కేసరి యూనివర్శిటీ వి.సి. ప్రొఫెసర్ మూర్తితో విశ్రాంత అధ్యాపకులు కాసేపు ముచ్చటించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్ర కేసరి యూనివర్శిటీ సి.డి.సి.డీన్ డాక్టర్ డి.వేంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.



## భట్టిప్రోలు గ్రామంలో సభలు సమావేశాలు నిషేధం

**భట్టిప్రోలు,పెన్ పవర్ ఆగస్టు 2**

మండల కేంద్రమైన భట్టిప్రోలు గ్రామంలో పోలీస్ యాక్ట్ 13 అమలులో ఉన్న నేపథ్యంలో ఏ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు గాని,కార్యకర్తలు గాని గ్రామ పురవీధులలో ఎటువంటి సభలు సమావేశాలు,చర్చ గోస్టి లు నిర్వహించకూడదని రేపల్లె డిఎస్పి మురళీకృష్ణ తెలిపారు.శుక్రవారం భట్టిప్రోలు పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,ఇటీవల వైసిపి వేమూరు నియోజకవర్గ ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు, తెలుగుదేశం రాష్ట్ర పార్టీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా మండల పరిధిలో ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని అభియోగం చేసిన నేపథ్యంలో సదరు సాయిబాబా శనివారం మధ్యాహ్నం 11 గంటలకు,భట్టిప్రోలు రథం సెంటర్లో చర్చా వేదిక ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో చర్చలు,సమావేశాలు నిషేధించబడినవని ఆయన పేర్కొన్నారు. తిరిగి పోలీసు వారు తెలిపే వరకు ఎటువంటి సమావేశాలు నిర్వహించకూడదని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో చుండూరు సిఐ సిహెచ్ శ్రీనివాసరావు, భట్టిప్రోలు ఎస్ ఐ కాసుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




## చెన్నై వెళ్లి పింఛన్ అందజేసిన సెక్రటరీ జగన్

### *99.4 శాతం పింఛన్ల పంపిణీ: ఎంపీడీఓ*




**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్ట్ 02**

చెన్నై విజయ షుగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడికి ఏకంగా సుమారు 300 కిలోమీటర్ల దూరం ప్రయాణించి వృద్ధాప్య పింఛన్ ను నాయుడుపాలెం పంచాయితీ సెక్రటరీ తిరువీధుల జగన్ శుక్రవారం అందజేశారు. వివరాలలోనికి వెళితే మండలంలోని నాయుడుపాలెం పంచాయితీ పరిధిలో ఉన్న కృష్ణాపురం గ్రామానికి చెందిన నల్లగట్ల సుధాకరరావు అనే వృద్ధాప్య పెన్షన్ దారునికి ఆరోగ్య పరిస్థితి సరిగాలేక చెన్నై విజయ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. బాధితుడి ఆరోగ్య, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మానవతా దృక్పధంతో నాయుడుపాలెం పంచాయతీ కార్యదర్శి జగన్ చెన్నై హాస్పిటల్ కు వెళ్లి బాధిత లబ్ధిదారునికి పెన్షన్ నగదు పంపిణీ చేశారు. మరికొందరు కూడా హాస్పిటల్స్ లో చికిత్స పొందుతున్న వారికి పింఛన్లు అందించే పనిలో ఉన్నారు. పింఛన్లు అందుకున్న కుటుంబ సభ్యులు సంబంధిత అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ దారులకు నగదు పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొని 99.4 శాతం పెన్షన్లు పంపిణీ చేయడం జరిగినదన్నారు. ఇంకా మండలం మొత్తం మీద 59 పింఛన్లు మిగిలి ఉన్నాయని, అందులో 26 పింఛన్లు డెత్ అయినవారివి కాగా, కొన్ని మైగ్రేషన్, మరికొన్ని పింఛన్ల వారు వివిధ చోట్ల హాస్పిటల్స్ లో చికిత్స పొందుతున్నారన్నారు. వీరికి కూడా పింఛన్లు అందించాలనే లక్ష్యంతో సిబ్బంది సహకారంతో వివిధ ప్రాంతాల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు పింఛన్లు అందించేందుకు చర్యలు చెప్పట్టి, ఇప్పటికే కొందరికి అందించడం జరిగినదని ఎంపీడీఓ తెలియజేశారు. పింఛన్ల పంపిణీ విజయవంతం చేయడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతూ, అధికారులకు, సిబ్బందికి అభినందనలను ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తెలిపారు.

## మాచవరంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు





**కందుకూరు పెన్ పవర్, ఆగష్టు 2**

మండలంలోని మాచవరం అంగన్వాడీ సెంటర్ 2 లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అంగన్వాడీ ఇంచార్జ్ సిడిపిఓ ప్రభావతి హాజరై అంగన్వాడి కేంద్రం పరిధిలో గర్భిణీ స్త్రీలకు,బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు వలన సంపూర్ణ ఆరోగ్యంతో పాటు, శిశువుకు రోగ నిరోధక శక్తి పెరగాలంటే తల్లిపాలు తప్పక పట్టించాలని, డబ్బా పాలు ,పోత పాలు పట్టించడం వలన శిశువు ఎదుగుదల లోపంతో పాటు భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు.నవజాత శిశువులకు తల్లిపాలే శ్రేష్టమన్నారు. తల్లీబిడ్డల శ్రేయస్సుకు తల్లిపాల వినియోగం ఎంత అవసరమో వివరించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంజయ్య, మహిళ పోలీస్, ఏఎన్ఎం మంజుల, హెల్త్ అండ్ న్యూట్రిషన్ సిబ్బంది,అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

**స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి సుధా మారుతి**



**పొదిలి, పెన్ పవర్ ఆగష్టు 2**

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం అని స్త్రీ శిశు సంక్షేమ శాఖ పొదిలి ప్రాజెక్టు అధికారి సుధా మారుతి అన్నారు శుక్రవారం నాడు పట్టణ శివారులోని బాప్టిస్ట్ పాలెం లో తల్లిపాల వారోత్సవ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న సి డి పి ఓ సుధా మారుతి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ఆరు మాసాల వరకు తల్లిపాలు అందించడం ఎంతో శ్రేయస్కరం అన్నారు తల్లిపాలు బిడ్డకు మొదటి టీకాగా పనిచేస్తుందన్నారు తల్లులు తమ బిడ్డల సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధసత్తులు చూపించాలని సిడిపిఓ సుధా మారుతి సూచించారు స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది సలహాలు సూచనలతో తమ పిల్లలను చక్కగా సురక్షితంగా ఎదిగేందుకు కృషి చేయాలని ఆమె కోరారు తల్లి బిడ్డల సంరక్షణ కు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని, ఆమె చెప్పారు ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లి పిల్లల సంక్షేమ పథకాలను సద్వినియోగపరుచు కోవాలని సిడిపిఓ సుధా మారుతి కోరారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ సావిత్రి, అంగన్వాడి కార్యకర్తల సంఘం నాయకురాలు శోభారాణి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న ఇంటూరి కుటుంబ సభ్యులు

**కందుకూరు పెన్ పవర్, ఆగష్టు 2**

శుక్రవారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ధర్మపత్ని సౌజన్య కుమారులు అవినాష్, సందీప్ లు దర్శించుకున్నారు.



# ఆగష్టు 1వ తేదీ నుంచి ఏడో తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు





**పొన్నలూరు పెన్ పవర్ ఆగష్టు 2**

ఈ నెల ఒకటవ తేది నుంచి ఏడో తేది వరకు తల్లి పాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.మండలంలోని అన్ని గ్రామాలలోని అంగన్వాడి సెంటర్ లో వైద్యాధికారి డాక్టర్ రవికిరణ్ , అంగన్వాడీ టీచర్ ఆరోగ్య సిబ్బంది కలిపి తల్లులకు తల్లిపాలు ఎలా ఇవ్వాలి. దానివల్ల ప్రయోజనాలు ఏమిటి అనేక అంశాలు కూడా వివరించడం జరిగింది.గృహ దర్శనం తో పాటు అన్ని స్కూళ్లలో కూడా విద్యార్థిని విద్యార్థులను పరీక్షించి అనుమానపు మచ్చలు ఉన్న పిల్లలను ప్రత్యేకించి పరీక్షలు జరిపి నిర్ధారణ కొరకు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాడు మాలపాడు కస్తూరి భా ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు లెప్రసీ వ్యాధి గురించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు మీకు ఎటువంటి మచ్చలు ఉన్నా పరిక్షించుకోవాలని అలాగే మీ కుటుంబ సభ్యులకు కూడా అవగాహనతో మచ్చలను ఆశా కార్యకర్తలు లేదా ఏఎన్ఎం దగ్గర చూపించుకోవాలని సూచించారు.రాగి రంగులో మచ్చలు , స్పర్శ తెలియని మచ్చలు , పొడులు పొడలుగా ఉన్న మచ్చలు, ఉన్న వారిని అనుమానమైన లెప్రసీ వ్యక్తులుగా గుర్తించి ,అందుబాటులో ఆరోగ్య సిబ్బంది ద్వారా పరీక్ష చేయించుకోవాలని., వ్యాధి నిర్ధారణ అయినవారికి ఆరు మాసాల నుండి తొమ్మిది మాసాల వరకు ఉచిత వైద్యము ఇవ్వబడును అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి కిరణ్ ప్రిన్సిపల్ సుభాషిణి , సూపర్వైజర్ శ్రీనివాసరావు ,సురేష్ బాబు అనిత ఇతర ఉపాధ్యాయుని లు పాల్గొన్నారు.



# వర్గీకరణతో మాదిగల జీవితాలలో వెలుగులు

**వర్ల దేవదాసు మాదిగ**



**కందుకూరు పెన్ పవర్, ఆగష్టు 2**

మాదిగల చిరకాల ఆకాంక్ష అయిన వర్గీకరణ సాదించి మాదిగల జీవితాల్లో వెలుగులు నింపబోతున్న మందకృష్ణ మాదిగ కి గుడ్లూరు లో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ మాజీ మండల సీనియర్ నాయకులు మెతుషల అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు వర్ల దేవదాసు మాదిగ మాట్లాడుతూ %ఖ్బ% వర్గీకరణ సాధించడం ద్వారా 100 తరాల మాదిగల భవిష్యత్తును నిర్దేశింపబోతుందని భవిషత్ తరాలకు ఆత్మవిశ్వాసం అందిస్తుంది అన్నారు. ఈ విషయంతో మాదిగ, మాదిగ ఉపకులాలు ముందడుగు వేస్తాయి అన్నారు. ఈ విజయం ఒక కుల విజయమో మరొక కులం అపజయము అని భావించ నక్కరలేదని రిజర్వేషన్లు నుంచి మాదిగ ఉపకులాలకు అన్యాయం జరుగుతుంది కాబట్టి మందకృష్ణ మాదిగ ఆత్మీయ విశ్వాసంతో పోరాటం చేశారు కాబట్టి విజయాన్ని సాధించి పెట్టారని అన్నారు. అంబేద్కర్ సాధించిన రిజర్వేషన్లు అందరికీ వారి వారి జనాభా దామాషా ప్రకారం పంచిపెట్టడమే ఈ పోరాటం యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు. 30 సంవత్సరాలుగా మందకృష్ణ మాదిగకి నమ్మి సహాయ సహకారాలు అందించిన ముఖ్య నాయకులకి కార్యకర్తలకి అదేవిధంగా మాదిగ లకు తోడ్పాటు అందించిన సమాజానికి మొత్తానికి మేము రుణపడి ఉన్నామని భవిష్యత్తులో కూడా సమాజ శ్రేయస్ కొరకు మందకృష్ణ మాదిగ ఎప్పుడు పనిచేస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మాజీ సీనియర్ నాయకులు రమేష్ మాదిగ, బాబురావు మాదిగ, ప్రకాశం మాదిగ, సర్పంచ్ డేవిడ్ మాదిగ, కరుణాకర్, దేవకుమార్, శిరీష, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్క రైతు విధిగా పచ్చి రొట్ట సాగు చేయాలి

**:గుంటూరు టొబాకో బోర్డు మేనేజర్ ఎక్సటెన్షన్ దామోదర్**





**కందుకూరు/ వలేటివారిపాలెం పెన్ పవర్, ఆగష్టు 2**

మేనేజర్ విస్తరణ టొబాకో బోర్డు. గుంటూరు దామోదర్ , రీజనల్ మేనేజర్ లక్ష్మణ రావు తో కలిసి కందుకూరు 11 వేలం కేంద్రాన్ని సందర్శించారు. ఇందులో భాగంగా వారు వలేటి వారి పాలెం గ్రామం సాగు చేసిన లో పచ్చి రొట్ట పైరును పరిశీలించారు. రైతులతో వారు మాట్లాడుతూ ప్రతి రైతు విధిగా పచ్చి రోట్ట పైరును సాగు చేయాలని దీని వలన నేల సారవంతం అవుతుందని తెలిపారు. అంతే కాకుండా మంచి నాణ్యమైన పొగాకు పండు తుందని అన్నారు. ఇంకా ప్రతి రైతు విధిగా 10 మొక్కలు పెంచి పర్యావరణ పరిర్షణకు పాటు పడాలని తెలిపారు. రీజినల్ మేనేజర్ లక్ష్మణ రావు మాట్లాడుతూ రైతు సోదరులు తమ పొగాకును పొగాకు బోర్డు లోనే అమ్ముకోవాలని తెలిపారు. వేలం కేంద్రం వెలుపల పొగాకు కొనుగోళ్ళు మరియు అమ్మకాలు చట్ట ప్రకారం నేరం అని తెలిపారు. అంతేకాకుండా అనధికార బారన్ ల నిర్మాణం చట్ట ప్రకారం నేరం అని తెలిపారు. పొగాకు బేల్లు బోర్డుకు తెచ్చేముందు ఒకసారి సారి చూసుకోవాలని , ముందు రోజు మార్కెట్ చూసుకుని దాని ప్రకారం పొగాకు తెచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణ అధికారి రాజగోపాల్ రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# పవర్ ప్లాంట్ నుండీ వస్తున్న కాలుష్యంపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు!

**నివారణ చర్యలు చేపట్టాలసిందేనని నిర్వాహకులను ఆదేశించిన ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి**





**పలమనేరు ఆగష్టు 02, (పెన్ పవర్):**

గంగవరం మండల కేంద్రం పరిధి కూర్నిపల్లి సమీపంలోని పవర్ ప్లాంట్ నుండి కాలుష్యం మరియు ధూళికణాలు వెలువడుతొందని మేలుమాయి పంచాయతీ మబ్బువాళ్ళపేట గ్రామస్తులు శుక్రవారం పలమనేరు శాసనసభ్యులు అమర్నాథరెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామానికి సమీపంలోని పవర్ ప్లాంట్ పొగగొట్టం నుంచి పొగ రూపంలో వెలబడుతున్న కాలుష్యంతో గ్రామస్థులకు కళ్ళు మంటలతో పాటు, త్రాగునీరు కలుషితం అవడమే కాకుండా, గ్రామస్తులకు విరేచనాలు అవుతున్నాయన్నారు. మరోవైపు బూడిద వర్ణంతో కూడిన దూళి ఇళ్లను కప్పేస్తోందని తెలియజేశారు.ఈ సందర్భంగా అక్కడ వెలువడిన దూళితో పాటు పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్య ఫోటోలను ఆయనకు చూపించారు.దీనిపై స్పందించిన ఆయన వెంటనే పరిశ్రమ నిర్వాహకులకు ఫోన్ చేసి కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని అంతవరకు పరిశ్రమ నిర్వహణ ఆపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతోపాటు గంగవరం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## నరసింహ స్వామిని దర్శించుకున్న ఏకేయూ వి.సి.

**ఘన స్వాగతం పలికిన అర్చకులు**



సింగరాయకొండ పెన్ పవర్, ఆగస్టు 2:సింగరాయ కొండ సమీపంలో ఉన్న శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఆంధ్ర కేసరి యూనివర్శిటీ ఉప కులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి శుక్రవారం సాయింత్రం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మూర్తికి వేద మంత్రాలతో ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణాన్ని తిలకించిన అనంతరం వి.సి.ప్రొఫెసర్ మూర్తి వరాహ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వరాహ నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న మరికొన్ని ఆలయాలలో కూడా ఆయన పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు పట్టణానికి చెందిన శ్రీ గాయత్రీ విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ సి.హెచ్.భరద్వాజ, ప్రిన్సిపాల్ పి.గీతా శ్రీనివాస్, సింగరాయ కొండ లోని అమృత డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అశోక్ తో పాటు పలువురు అధ్యాపకులు ఉన్నారు.

## తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం





**కందుకూరు పెన్ పవర్, ఆగష్టు 2**

బిడ్డలకు తల్లిపాలే శ్రేష్టమని ఆరోగ్యకరమని ఐసిడిఎస్ సూపర్వైజర్ షకీలా పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఏ సెక్టార్ నందుగల ఎన్ కె నగర్ అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షకీల మాట్లాడుతూ ముర్రుపాలు వలన శిశువులకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. తల్లిపాల వలన బిడ్డకు బలం వస్తుందని ఆరోగ్యంగా పిల్లలు ఉంటారని అన్నారు. అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు బలవర్ధకమైన పౌష్టిక ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బ్యూలా గ్రేస్, పిహెచ్ఎన్ పద్మావతి అంగన్వాడి కార్యకర్తలు రోహిణి, సుజాత, షాకీర యాస్మిన్, కేశవ, ఈశ్వరమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.



# అత్యంత భక్తిశ్రద్ధలతో వీర్లం

## అమ్మవారికి పసుపు, కుంకుమ, సారె సమర్పించిన బక్కా, నంగు, ఆసాది, మర్రివారి ఆడపడుచులు







చీరాల, ఆగస్టు 02,పెన్ పవర్:

భక్తుల కష్టాలు తీర్చే కల్పవల్లిగా, కులదైవంగా చీరా ల మండలం, చీరాల నగర్ పం చాయతీ పరిధిలోని,పాత చీరా ల గ్రామంలో వేంచేసి ఉన్న, శ్రీ వీర్లంకమ్మ అమ్మవారికి, బక్కా, నంగు, ఆసాది, మర్రి కుటుంబా లవారి ఆడపడుచులు, అత్యం త భక్తిశ్రద్ధలతో, పసుపు, కుంకు మ, సారె సమర్పించారు. కొత్త పాలెం శ్రీ పోలేరమ్మ దేవస్థాన కమిటీ అధ్యక్షులు బక్కా శివ ప్రసాద్ రెడ్డి, మర్రి రంగా రెడ్డి, బక్కా అంకిరెడ్డి, బక్కా బసివి రెడ్డి, బక్కా కోటిరెడ్డి తదితర గ్రామ పెద్దల పర్యవేక్షణలో, కొత్తపాలెం గ్రామం నుండి, భారీ ఊరేగింపుగా, మేళతాళాలతో, మంగళ వాయిద్యాలతో,బక్కా, నంగు, ఆసాది, మర్రి కుటుం బాల వారి ఆడపడుచులు, పాత చీరాల వీర్లంకమ్మ అమ్మ వారి దేవస్థానానికి తరలి వెళ్లా రు. పాత చీరాల, కొత్తపాలెం, పరిసర గ్రామాల మహిళా భ క్తులు, తమ కుల దైవమైన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పసుపు, కుంకు మ, సారె సమర్పించి, భక్తి శ్రద్ధలతో మొక్కులు తీర్చుకు న్నారు. ఈ సందర్భంగా అమ్మ వారికి ప్రత్యేక అలంకరణ చేసి, భక్తులకు దర్శన భాగ్యం కల్పిం చారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంచి పెట్టారు.

# తిరుమలయ్యకు ఘన నివాళులు



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 2**

గిద్దలూరు నగర పంచాయతీ లోని పాములపల్లె గ్రామంలో టిడిపి నాయకులు బండా తిరుమలయ్య మృతి పట్ల చింతిస్తూ వారి భౌతిక కాయానికి గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.. వారితో పాటు మాజీ సర్పంచ్ దప్పిలి భాస్కర్ రెడ్డి, దప్పిలి కాశిరెడ్డి స్థానిక నాయకులు తదితరులు నివాళులు అర్పించారు.

# హోటల్లు- రెస్టారెంట్ల పై ఆకస్మిక తనిఖీ



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 2**

గిద్దలూరు పట్టణంలో గురువారం రాత్రి అర్బన్ సీఐ సోమయ్య పలు రెస్టారెంట్లు 'హోటల్ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటల్లు రెస్టారెంట్లలో మద్యం విక్రయించిన ' మద్యం తాగేందుకు అనుమతి ఇచ్చిన అటువంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సోమయ్య హోటల్లు 'రెస్టారెంట్ల నిర్వాహకులను హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామని సిఐ సోమయ్య హెచ్చరించారు.

# పేరలి గ్రామంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు




**పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్ బాపట్ల ఆగస్టు 2 :**

కర్లపాలెం మండలం పేరలి గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు శు క్రవారం ఘనంగా నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాలు యొక్క ప్రాధాన్యత గురించి గర్భవతులకు అవగాహన కల్పించారు. ప్రతి తల్లి తన బిడ్డలకు తన పాలు మాత్రమే ఇవ్వాలి డబ్బా పాలు ఇవ్వకూడదని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంచిన గుడ్లూరు మండల జనసేన



**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్టు 02**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీజీ సూచించిన తిథి బోజన్ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని కందుకూరు నియోజకవర్గ జనసేన నాయకులు దేవళ్ళ భాస్కరరావు సూచనల మేరకు సన్నిశెట్టి గిరి మండలంలోని వెంకంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజ నంలో పిల్లలకు పండ్లు, స్వీట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో స్థానిక టీడీపీ నేతలు బి.మల్లయ్య, తిరుమలరావు ల ప్రోత్సా హంతో మండల విద్యాధికారి గోవర్ధన్ సలహా మేరకు పాఠశాల ఉపాధ్యా యులు సహకారంతో ఈ కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. బడి పిల్లలకు అన్నంతో పాటు పౌష్టికాహారం అందించాలనే సదుద్దేశంతో మా వంతు సాయం చేయడమే జనసేన లక్ష్యం అని సన్నిశెట్టి గిరి అన్నారు.

# పొదిలిలో ఘనంగా పింగళి వెంకయ్య జయంతి వేడుకలు

**పొదిలి, పెన్ పవర్ ఆగస్టు 2**

జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతి వేడుకలు శు క్రవారం నాడు పొదిలిలో ఘనంగా జరిగాయి పట్టణంలోని నిర్మలా కాన్వెంట్ రోడ్ లో గల చైతన్య కళా స్రవంతిలో పింగళి వెంకయ్య 148వ జయంతి ఉత్సవాలు ఎంతో అట్టహాసంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ పింగళి వెంకయ్య దేశానికి చేసిన సేవలను వివరించారు అటువంటి మహనీయుని ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని ఎం ఈ ఓ శ్రీనివాసులురెడ్డి కోరారు ముందుగా పింగళి వెంకయ్య చిత్రపటానికి మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు రెడ్డి పూలదండ వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసరెడ్డి తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.



# ఎస్సీ,ఎస్టీల ఉప వర్గీకరణ కోటా రాజ్యాంగబద్ధమే



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 2**

షెడ్యూల్డ్ కులాలు ,షెడ్యూల్డ్ తెగల ఉపవర్గీకరణ ఆమోద యోగ్యమేనని ఆయా వర్గాలలో అత్యంత వెనుకబడిన ఉప వర్గాల వారికి రాష్ట్రస్థాయిలో కోటాలో ప్రత్యేక కోటా కేటాయించవచ్చని ఏడుగురు సభ్యుల ధర్మాసనం గురువారం మెజారిటీ తీర్పును వెలువరించడం హర్షనీయమని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎస్సీ ,ఎస్టీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ గిద్దలూరు నియోజకవర్గ కన్వీనర్ పెరికె మహేష్ బాబు పేర్కొన్నారు. ఎస్సీలంతా ఒకే స్థాయిలో లేరని, అందులో సామాజికంగా, విద్య పరంగా మరింత వెనుకబడిన వర్గాలు ఉన్నాయని వాటిని పైకి తీసుకురావడానికి ఎస్సీ వర్గీకరణ చేయడానికి రాష్ట్రాలకు రాజ్యాంగబద్ధంగానే ఆ అధికారం ఉందని చారిత్రాత్మక తీర్పులో పేర్కొంది. ఈ సందర్భంగా పెరికె మహేష్ బాబు మాట్లాడుతూ గతంలో ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఏబిసిడి కేటగిరీలలో 1996 -97 లో రామచంద్రరావు కమిషన్ వేసి ఏబిసిడి వర్గీకరణ తెలుగుదేశం పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాత్ర కీలకమని ఆయన కొనియాడారు. ఎస్సీ వర్గీకరణ పోరాటం ముందుకు నడిచి విజయం సాధించిందంటే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెచ్చిన చట్టమే కారణం అన్నారు .నాడు ఆయన వర్గీకరణ చేయకపోతే వేలాది ఉద్యోగాలు వచ్చేవి కాదని. విద్య అవకాశాలు దక్కేవి కాదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన చట్టాన్ని సుప్రీంకోర్టు సమర్థించిందన్నారు. చంద్రబాబు నాయుడు ఎప్పుడు న్యాయం, ధర్మం వైపే ఉంటారని మరోసారి రుజువైందన్నారు ఈ సమయంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉండడం జాతి భవిష్యత్తుకు ఉపయోగపడుతుంది అని పెరికె మహేష్ బాబు వ్యాఖ్యానించారు. 2004లో ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగల పక్షపాతిగా నిలిచారని. మరల నేడు అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ ఆమోదించడం శుభపరిణామం అన్నారు. ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమ ఫలితంగా, తెలుగుదేశం పార్టీ అధినేత ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో ,భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హామీతో, సుప్రీంకోర్టు వర్గీకరణ అనుకూలంగా తీర్పునీయడం ఎంతో హర్షించదగ్గ విషయమని పెరికె మహేష్ బాబు పేర్కొన్నారు.

# కౌలు రైతులకు ప్రభుత్వం రుణాలను మంజూరు చేయాలి

## రైతు సంఘ నాయకులు డిమాండ్.




**కావలి పెన్ పవర్ ఆగస్టు 2**

కౌలు రైతులకు పెట్టుబడి క్రింద ప్రభుత్వం రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు షాన్ వాజ్, రైతు సంఘ జిల్లా నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక జర్నలిస్ట్ క్లబ్ నందు రైతు సంఘం ఆధ్వర్యంలో వారి మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ, రాష్ట్రంలో కౌలు రైతుల గుర్తింపు కార్డుల విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యానికి గురిచేస్తున్నాయని మండిపడ్డారు. భూ యజమానులతో సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా గుర్తింపు కార్డులను అందజేయాలన్నారు .గుర్తింపు కార్డులు ఉన్న రైతులందరికీ ప్రభుత్వం రుణ సహాయం చేయాలని కోరారు.గత ప్రభుత్వం గుర్తింపు కార్డు ఉన్న రైతులకు కూడా ఆర్థిక సహాయం అందించయలేదని తెలిపారు .ఎన్నికల హామీలలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కౌలు రైతులను ఆదుకుంటామని పంట పెట్టుబడికి 20 వేల రూపాయలు రుణ సహాయం ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారని వాటిని వెంటనే మంజూరు చేయాలని కోరారు. అలానే రిజర్వ్ బ్యాంక్ నిబంధనలను ప్రకారం రైతులకు ఎలాంటి షూరిటి లేకుండా 1,60,000 వడ్డీ లేని రుణాలను మంజూరు చేయెచ్చు అని ఉన్నదని కానీ అది ఎక్కడ అమలు కావటం లేదని తెలిపారు. దీంతో కౌలు రైతులు వడ్డీ వ్యాపారస్తుల దగ్గర రుణాలు తీసుకుని అప్పుల పాలవుతున్నారని అందుకే రాష్ట్రం ప్రభుత్వం ఆర్బిఐ నిబంధనల ప్రకారం షూరిటి లేని రుణాలు ఇచ్చేలా చూడాలని కోరారు. భూములు ఉన్న వారు ఎవరు కూడా వ్యవసాయం చేయడం లేదని 60% శాతం పైగా కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారని, వారిని ప్రభుత్వం భూ యజమానులతో సంబంధం లేకుండా ఆదుకోవాలని కోరారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం గడ్డు పరిస్థితుల్లో ఉందని వ్యవసాయం చేసే రైతులను, కౌలు రైతులను ప్రభుత్వాలు సబ్సిడీ విత్తనాలను, ఎరువులను అందజేసి , మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలని కోరారు. వాతావరణంలో వచ్చే విపత్తుల వలన నష్టపోయిన రైతాంగానికి బీమా సౌకర్యం కల్పించి ఆదుకోవాలని ఉన్న కొందరు రైతులకు ఇంకా బీమా సౌకర్యం అందలేదన్నారు. గత సంవత్సరం వర్షాలు లేక చాలా మంది రైతులు ఇబ్బందులు గురయ్యారన్నారు. గత సంవత్సరం పంట నష్టం జరిగిన రైతులను ఆదుకోవాలని కోరారు. కౌలు రైతులే లేకపోతే వ్యవసాయం చేసే వారే లేరని ప్రభుత్వాలు అన్ని విధాల వారిని ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా రైతు సంఘ కార్యదర్శి కె రాజగోపాల్, సహాయ కార్యదర్శి కె శివయ్య ,వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు డి దర్గాబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ అప్పులపై మారటోరియం విధించాలి - ప్రొఫెసర్ విశ్వనాథం



**వేమూరు(భట్టిప్రోలు) పెన్ పవర్ ఆగస్టు 2:**

అప్పులతో అతలాకుతలం అవుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మారటోరియం విధించి రాష్ట్రాన్ని ఆదుకోవాలని ప్రొఫెసర్ విశ్వనాథం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాబడి కంటే ఖర్చులు ఎక్కువయ్యాయని దానికి తోడు రాజకీయ పార్టీలు ఇచ్చే సంక్షేమ పథకాల అమలు కోసం రాష్ట్రం మరింత అప్పుల్లో కూరుకుపోయిందన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్షిక బడ్జెట్లో అధిక భాగం అప్పులకు వడ్డీ రూపంలో చెల్లించాల్సి వస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 2019 కి ముందు రూ 3.5 లక్షల కోట్లు ఉంటే, నేటికీ తొమ్మిది లక్షల కోట్లకు పైగా చేరిందన్నారు.అప్పులకు ప్రతి ఏడాది 30 వేల కోట్ల రూపాయలకు పైబడి వడ్డీ రూపంలో చెల్లించాల్సి వస్తుందని పేర్కొన్నారు. విడగొట్టబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆదాయ మార్గాలు లేకపోవడం తో ప్రభుత్వం నడవాలంటే అప్పుల కోసం వెళ్లాల్సి వస్తుందన్నారు.రాష్ట్ర విభజన కాలంలో విడగొట్టబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేయూతనందిస్తానని ఆనాటి కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.అదే దృక్పథంతో ఈనాటి కేంద్ర ప్రభుత్వం కూడా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.గతంలో కూడా రాష్ట్ర విభజన సమయాల్లో కొన్ని రాష్ట్రాలకు ఆర్థిక ఇబ్బందులు గట్టెక్కించేందుకు మారటోరియం విధించారని గుర్తు చేశారు.కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొస్తున్నటువంటి ఆర్థిక పరమైన నిర్ణయాల వల్ల రాష్ట్రాలు అప్పుల ఊబిలోకి వెళుతున్నాయని ప్రొఫెసర్ విశ్వనాథం విమర్శించారు. గతంలో ప్రణాళికా సంఘం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను సముతల్యం చేస్తూ రాష్ట్రాలుఅప్పుల ఊబిలోకి వెళ్లకుండా తగు సూచనలు ఇచ్చేయమన్నారు. అయితే ప్రణాళిక సంఘం రద్దయి దాని స్థానంలో వచ్చినటువంటి నీతి అయోగ్ రాష్ట్రాల్లో మరింత అప్పులు ఊబిలోకినెట్టే విధంగా చూస్తుందని విమర్శించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్2.86 లక్షల కోట్లు ఉండగా రెవెన్యూ రాబడి రూ 2.05 లక్షల కోట్లు మాత్రమే ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వ పన్నుల ద్వారా 34 శాతం రావాల్సి ఉండగా కేవలం 24 శాతము మాత్రమే కేంద్రం రాష్ట్రానికి అందిస్తుందన్నారు. ఆర్థిక ఇబ్బందులతో అప్పుల్లో కూరుకుపోయి ఆర్థిక విసులుబాటులేక ఇబ్బందులు పడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆర్థిక పరంగా వృద్ధ చెందేందుకు ఐదేళ్లపాటు ఆంధ్రప్రదేశ్ అప్పులపై మారిటోరియం విధించాలని ప్రొఫెసర్ విశ్వనాథం గుర్తు చేశారు.నష్టాల్లో ఉన్న కార్పొరేట్ కంపెనీలను ఆదుకునేందుకు లక్షల కోట్ల రూపాయలు రుణాలను రద్దు చేసినటువంటి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న రాష్ట్రాలను ఆదుకునే చర్యలు తీసుకోవాలన్నారు,దీనిపై ఆర్థిక నిపుణులు, మేధావులు తగురీతిలో స్పందించి పోరాడేందుకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అభివృద్ధికి కృషి చేద్దాం



**పెన్ పవర స్టాప్ రిపోర్టర్ బాపట్ల ఆగస్టు 2**

రెడ్ క్రాస్ సొసైటీ ఆశయ సాధనకు కృషి చేద్దామని కర్లపాలెం గౌరవ తాసిల్దార్ గారు, మండల రెడ్ క్రాస్ అధ్యక్షులు ఎస్ వెంకటరత్నం అన్నారు. శుక్రవారం నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన తాసిల్దార్ గారిని మండల రెడీ క్రాస్ యూనిట్ గౌరవ భాగంగా కలిసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తాసిల్దార్ గారు మాట్లాడుతూ అధిక సభ్యులు చేర్పించి సేవా కార్యక్రమాల్ని ముందుకు తీసుకెళ్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెడ్ క్రాస్ యూనిట్ చైర్మన్ ఈ పోలీసు రావు. ఏం పరమానంద కుమార్. పి ధనుంజయ్, బి రాజేష్. జి వెంకటరెడ్డి. పి వెంకట్ నాథ్ తదితరులు పాల్గొన్నారు. ఫోటో. తాసిల్దార్ గారు కలిసిన మండల రెడ్ క్రాస్ యూనిట్ సభ్యులు.


# సుప్రీం కోర్టు తీర్పు పట్ల ఆనందం వ్యక్తం చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

**కొనకనమిట్ల పెన్ పవర్ ఆగస్టు 2**

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షనీయమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు యద్దనపూడి విలియం అన్నారు.గురువారం దేశ అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టు వర్గీకరణ సమర్థనీయమని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అవసరమని జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం 6:1 నిష్పత్తితో తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో పలువురు మాట్లాడుతూ ..కనీ విని ఎరుగని రీతిలో మందకృష్ణ మాదిగ అలుపెరగని పోరాటంలో భాగస్వామ్యులైన ప్రతి ఒక్క ఎంఆర్పిఎస్ ఉద్యమకారుల విజయమని ఎమ్మార్పీఎస్ నాయకత్వం ఆధ్వర్యంలో న్యాయవ్యవస్థకు, దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, కృతజ్ఞతలు తెలుపుతూ, మండల కేంద్రమైన కొనకనమిట్ల గ్రామంలోని కమ్యూనిస్టు కార్యాలయంలో శుక్రవారం కేక్ కటింగ్ చేసి,స్వీట్స్ పంచి సంబరాలు చేసుకున్నారు.ఈ విజయానికి మద్దతు తెలిపిన అన్ని వర్గాల ప్రజలకు, సామాజిక ఉద్యమకారులకు, రాజకీయ నాయకులకు, మాదిగ జాతి జాతి యావత్తు తరపున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చిన్న కోటేశ్వరరావు,చిరుగురి రాజు,చిరుగురి కోటేశ్వరరావు,ఎమ్మార్పీఎస్ నాయకులు డేవిడ్,కరుణయ్య, ఏసు విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## తిరుపతి బర్డ్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న లబ్ధిదారునికి పింఛన్ అందజేత



**పలమనేరు ఆగస్టు 02, (పెన్ పవర్)**

పలమనేరు నియోజకవర్గ పరిధిలోని గంగవరం పంచాయతీ డ్రైవర్ కాలనీకి చెందిన అన్నమయ్య అనారోగ్య కారణంగా తిరుపతి బర్డ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రతినెల పింఛన్ తీసుకుంటున్న ఆయన స్వగ్రామంలో లేరని తెలుసుకొని,ప్రభుత్వ ఆదేశాల మేరకు సకాలంలో లబ్ధిదారునికి పింఛన్ అందజేయాలన్న లక్ష్యం తో మారేడుపల్లి సచివాలయానికి చెందిన వెల్ఫేర్ సెక్రెటరీ దిలీప్ తిరుపతి బర్డ్ హాస్పిటల్ నందు చికిత్స తీసుకుంటుంటే అక్కడికి వెళ్లి పెన్షన్ అందించడం జరిగింది. దీంతో పింఛన్ అందించిన సచివాలయ అధికారికి లబ్ధిదారుడు అన్నమయ్య కృతజ్ఞతలు తెలిపారు.

## బెస్తవారిపేట మండలంలో 99 శాతం పింఛన్ల పంపిణీ



**బేస్తవారిపేట, పెన్ పవర్ ఆగస్టు 2**

బెస్తవారిపేట మండలంలో ఆగస్టు నెల పింఛన్ల పంపిణీ కార్యక్రమం బేస్తవారిపేట ఎంపీడీవో టీ పార్వతి పర్యవేక్షణలో 99.22 శాతము పెన్షన్లు పంపిణీ చేసినట్లు బేస్తవారిపేట మండలంలోని 19 గ్రామపంచాయతీలలో చేనేత, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లు 71 7 6 పెన్షన్లు ఉండగా అందులో 71 20 పెన్షన్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. వివిధ కారణాలతో అందుబాటులో లేని 56 మంది కి పెన్షన్లు అందజేయలేదన్నారు. మండలంలో 99. 22 శాతం పెన్షన్లు అందజేయడం జరిగిందని ఎంపీడీవో టీ పార్వతి తెలిపారు.

## అబ్దుల్ కలాం ఫౌండేషన్ కర్లపాలెం ద్వారా ప్రతి శుక్రవారం సేవలు



**పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్ బాపట్ల ఆగస్టు 2 :**

అబ్దుల్ కలాం ఫౌండేషన్ కర్లపాలెం ద్వారా ప్రతి శుక్రవారం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఫౌండేషన్ ప్రెసిడెంట్ ,గ్రామ ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ బాష తెలిపారు.కర్లపాలెం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాత కర్లపాలెం లోని నిరుపేద మహిళకు 10 కేజీల బియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పఠాన్ అహ్మద్ బాష మాట్లాడుతూ పేదలకు ప్రతి శుక్రవారం బియ్యం ,నిత్యావసర సరుకులు ,దుప్పట్లు ,అనారోగ్యంగా ఉన్న వారికి ఆర్థిక చేయూత అందించడం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ హబీబ్ ,షేక్ జిలాని ,షేక్ బహదూర్ బాష ,షేక్ ఇబ్రహీం, మాజీ వార్డు మెంబర్ షేక్ నబి ,షేక్ రియాజ్ ,ఉప్పలపాటి వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు

## కస్తూరిబాయ్ స్కూల్ నందు మొక్కల పంపిణీ చేసిన పరిటాల సురేష్

**దర్శి,పెన్ పవర్ ఆగస్ట్ 2**

మండ్లమూరు లోని,ప్రభుత్వ కస్తూరి బాయి స్కూల్ నందు హెడ్మాస్టర్ సునీత ఆధ్వర్యంలో స్కూల్ నందు మొక్కలు ఇచ్చి ,నాటే కార్యకరమాన్ని చేపట్టారు. ఈ సందర్భముగా, పరిటాల సురేష్ పరిటాల సురేష్ మాట్లాడుతు పచ్చదనం పరిశుభ్రత పరిరక్షణ కోసం మనమందరం పాటు పడాలి అని అన్నారు. వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గు దల ఉండాలి అంటే ప్రతిమనిషి భాద్యతగా వారి ఇంటి పరిసరాల్లో మొక్కలు పెంచాలి అన్నారు, డాక్టర్ టీచర్ ఆంజనేయులు మాట్లాడుతూ, చెట్లు చెట్లు నరకడం వలన వర్షాలు సరిగా పడవు అని అన్నారు.ప్. ఝాన్సీ,ప్.మాలతి,వి. రత్నకుమారి,ఈ.పుణ్యవతి,ఈ. పద్మజ, చంద్రకళ ,మొదలగు వారు పాల్గొన్నారు.






# అనధికార లే అవుట్ లు వేసి ప్రజలను మోసం చేస్తే సహించను

### శానిటేషన్, టిడ్కో గృహాలు, మంచి నీటి సరఫరా ప్రథమ ప్రాధాన్యాలు - మాజీమంత్రిప్రత్తిపాటి









**చిలకలూరిపేట పెన్ పవర్ ప్రతినిధి ఆగస్టు 02 :**

పట్టణంలో ప్రజల మౌలిక సదుపాయల కల్పనే ప్రథమ ప్రాధాన్యాలుగా పెట్టుకున్నానని, వాటిని గాడిలో పెట్టే వరకూ అవిశ్రాంతంగా పని చేస్తాను, అధికారులతో పని చేయిస్తానని ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శుక్రవారం ఉదయం 22 వ వార్డు పరిధిలో హీరో హోండా షోరూం ఎదురుగా మంచి నీటి పైపు లైన్ లీకేజీ పనులను, రిజిస్టర్ ఆఫీసు ముందు ఉన్న సులభ కాంప్లెక్స్ ను సందర్శించడం జరిగింది.సులభ కాంప్లెక్స్ ద్వారా వచ్చే వ్యర్థాలను మురుగు నీటి కాల్వలోకి పెట్టకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం టిడ్కో గృహ సముదాయాన్ని సందర్శించి, మంచినీటి చెరువు వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్ వ్యవస్థ పనితీరును పరిశీలించారు.అనంతరం గణపవరం మంచినీటి చెరువును పరిశీలించడం జరిగింది.ఈ సంధర్భంగా జరిగిన పాత్రికేయుల సమావేశంలో ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ, టిడ్కో గృహాల లబ్దిదారులకు పలు సమస్యలు ఉన్నాయని, ఇళ్లు రిజిస్ట్రేషన్ జరిగి తాళాలు తీసుకొని నివాసం ఉండని ఇళ్లు వెనక్కు తీసుకోవడం జరుగుతుందని,నెల రోజుల వ్యవధిలో ప్రభుత్వం నుండి గృహాల లబ్దిదారులకు సానుకూల నిర్ణయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే నాన్ లే అవుట్ల పేరిట గత 5 సంవత్సరాలలో జరిగిన దోపిడీకి అడ్డుకట్ట వేయడానికి ధృడమైన నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. లే అవుట్ లు ద్వారా ఇక నుండి స్థిరాస్తి వ్యాపారులు వారి వ్యాపారం స్వేచ్ఛగా చేసుకోవచ్చని తెలిపారు. ప్రజలకు కూడా లే అవుట్ లలో ప్లాట్లు కొంటే అనుమతులు కూడా వెంటనే వస్తాయని తెలిపారు.శానిటేషన్ ను మెరుగుపరచడానికి ప్రతి రోజూ అధికారులను, స్థానిక పార్టీ నేతలను ఉదయం 6 గంటల నుండి వార్డులలో తిరిగి సమస్యలను పరిష్కరించమని సూచించానని,15 రోజుల వ్యవధిలో కొంత మార్పు కనిపించిందని ప్రజలే చెబుతున్నారని తెలిపారు. మరింత మెరుగైన శానిటేషన్ పట్టణ వాసులకు అందించి ప్రజారోగ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా సాగుతామని తెలిపారు.

## పూసలపాడులో కంది పంటపై పొలంబడి



**బేస్తవారిపేట పెన్ పవర్ ఆగస్టు 2**

బేస్తవారిపేట మండలం లోని పూసలపాడు గ్రామంలో కంది పైరు సాగు చేసినటువంటి రైతులకు శుక్రవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బేస్తవారిపేట మండల వ్యవసాయ అధికారిని జక్కం మెర్సీ మాట్లాడుతూ పొలం బడి ఆవశ్యకతను రైతులకు వివరించారు. తక్కువ పెట్టుబడితో రైతులు ఎక్కువ ఆదాయం పొందేందుకు తగిన సూచనలు ఇవ్వటమే ఈ పొలంబడి ముఖ్య ఉద్యేశం అని తెలియజేశారు.తక్కువ పురుగు మందులు వాడకం,పురుగుల పరిరక్షణ,అదే విధ మట్టి నమూనాలు సేకరించి మట్టి పరీక్షలు చేయించడం వలన మట్టిలో ఉన్నపోషకాలను తెలుసుకోగలుగుతాము అని తెలియజెశారు.మట్టి నమూనాల పరీక్షల వలన పంటలకు ఎంత మోతాదులో ఎరువులు వాడాలో తెలియడం జరుగుతుందన్నారు.ఎక్కువ మోతాదులో ఎరువులు వాడకుండా రైతులు ఖర్చు తగ్గింవచ్చు అని తెలియజేశారు.కందిలో విత్తన శుద్ధి ద్వారా, భూమి ద్వారి వచ్చే తెగుళ్ళను అరికట్టవచ్చును అని వ్యవసాయ అధికారి జక్కం మెర్సీ తెలియచేశారు.ఈ కార్యక్రములో పూసలపాడు వి ఏ ఏ నవీన్ మరియు రైతులు పాల్గొన్నారు.

## వేటపాలెం తహసీల్దార్‌గా పార్వతి బాధితులు



**వేటపాలెం,పెన్ పవర్,ఆగస్టు 02**

వేటపాలెం మండల తహసీల్దార్ గా పార్వతి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వేరే జిల్లాలో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల లో భాగంగా ఆమె వేటపాలెం మండలానికి వచ్చారు. మండల ప్రజలకు సదా అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ పార్వతి తెలిపారు.కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్చం అందజేసి ఆమెకు స్వాగతం పలికారు. తదుపరి ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు.

## ఎం.బి.బి.ఎస్. పట్టభద్రుల హోదా

***కలిగిన వైద్యుల వద్దే వైద్యసేవలు పొందండి!***

***డెంగ్యూ, మలేరియా జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి***

***ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ మమతారాణి***

**పలమనేరు ఆగస్టు 02, (పెన్ పవర్)**

ఎం.బి.బి.ఎస్.హోదా కలిగిన వైద్యుల వద్దే వైద్యసేవలు పొందాలని, అలాగే మలేరియా, డెంగ్యూ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలమనేరు ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ మరియు చిన్నపిల్లల వైద్యులు మమతా రాణి సూచించారు.ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుత వర్షాకాలంలో దోమల ప్రభావం వలన డెంగ్యూ మలేరియా వస్తుందని, ఇంటి చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరికైనా జ్వరం వస్తే మంచి పట్టభద్రులైన వైద్యుల వద్ద చికిత్స పొందాలన్నారు. ఎటువంటి సరైన అర్హత లేని చోటు వైద్యం చేయించుకొని తీరా జ్వరం ముదిరిపోయిన తర్వాత వస్తే, కష్టమవుతుందని అన్నారు.డెంగ్యూ ఉన్నట్లయితే, ప్లేట్లెట్స్ మానిటరింగ్ చేసుకుంటూ,చికిత్స అందిస్తామని ఈ సందర్భంగా మమత రాణి తెలియజేశారు. పలమనేరు ఏరియా హాస్పిటల్ నందు యాంటీ స్నేక్ వినం మెడిసిన్ అందుబాటులో ఉందని,పాము కరిచిన వెంటనే ఆసుపత్రికి తీసుకురావాలని,అలా కాక నాటు వైద్యాలు చేసుకోవడం మంచిది కాదని,ఒక్కోసారి మనిషి ప్రాణాలకు కూడా ప్రమాదం జరగవచ్చని ఆమె హెచ్చరించారు.



## ఓట్లేసి గెలిపించినందుకు కృతజ్ఞతలు

### ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గారి సతీమణి లావణ్య



**బెల్లంకొండ ఆగస్టు 2 పెన్ పవర్ ప్రతినిధి**

బెల్లంకొండ మండలం ఎమ్మాజి గూడెం గ్రామంలో పాపాయిపాలెం గ్రామంలో భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య ఆయా గ్రామాల ప్రజలను ఇంటింటికి వెళ్లి పలకరిస్తూ అందరికీ హృదయపూర్వక కృతజ్ఞత ధన్యవాదాలు తెలియజేశారు ప్రవీణ్ గెలిపించినందుకు మీ అందరికీ ఎన్నికల ముందు ఏమైతే వాగ్దానాలు చేసినామో ఆ హామీలన్నీ అమలయ్యే బాధ్యత మేము తీసుకుంటామని, ప్రభుత్వం ద్వారా అందాల్సిన పథకాలన్నీ అందించే బాధ్యత ఎమ్మెల్యే ప్రవీణ్ గారి ద్వారా మేమందరం తీసుకుంటామని మండల గ్రామాల ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి మైనార్టీ ఉపాధ్యక్షులు పి ఎస్ కే మస్తాన్ షరీఫ్ బెల్లంకొండ గ్రామ సర్పంచ్ జ్యోతి సముద్రం తమ్మిశెట్టి రామకృష్ణ పేరయ్య వెంకట్రావు సర్పంచ్ ప్రసాద్ రావు ఏడుకొండలు బ్రహ్మారెడ్డి గుంజా గంగారావు ఓర్చు ఆనంద్ బాబు తమ్మిశెట్టి సత్యనారాయణ తదితర నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## నోటు పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్ ఎమ్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ థామస్..

### సామాజిక వెనుకబాటుకి చదువు ద్వారా విముక్తి.. - ఫౌండేషన్ ఛైర్మన్ థామస్..



**స్టాఫ్ రిపోర్టర్,పెన్ పవర్,ఒంగోలు ఆగస్టు,2**

సామాజిక వెనుకబాటుతనం నుంచి చదువు ద్వారానే విముక్తి కలుగుతుందని ఎం ఎం ఆర్ ఫౌండేషన్ చైర్మన్ మక్కెన థామస్ పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు మంగమూరు డొంక సాగర్ కెనాల్ రోడ్డు లోని శాంతి వనం రాత్రిబడి ఆధ్వర్యంలో పశువుల కాపరుల చిన్నారులకి ఉచిత నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకులు, కథా రచయిత మంచికంటి వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో థామస్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనుకబాటుతనాన్ని చదువు ద్వారా అధిగమించవచ్చని ప్రతి ఒక్కరూ పిల్లల్ని చదివించాలని కోరారు. అందుచేతనే ఎం ఎం ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక గ్రామాల్లో చదువు కునే చిన్నారులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికి ఫౌండేషన్ ద్వారా 600మంది వరకు పిల్లలకు నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో జానుడి - సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ నూకతోటి రవికుమార్, ట్యూషన్ సెంటర్ టీచర్ మరియమ్మ, ఫిలిం డైరెక్టర్ పి. సురేష్ చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పిల్లలకు తల్లిపాలే ఆరోగ్యం



**భట్టిప్రోలు,పెన్ పవర్ ఆగస్టు 2:**

ప్రపంచ తల్లి పాల వారోత్సవాలలో భాగంగాశుక్రవారం వెల్లటూరులోని ఓసి-1 అంగన్వాడి సెంటర్ లో గర్భవతులు, బాలింతలు,పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా అమృత లూరు ప్రాజెక్ట్ సిడిపిఓ విజయలక్ష్మి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని, తల్లిపాలు మొదటి టీకా గా గుర్తించారని, బిడ్డ పుట్టిన అరగంటలోపు తల్లిపాలు ఇవ్వడం ద్వారా బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, తద్వారా బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు.ఇలా ఆరు నెలల తర్వాత బిడ్డకి ఆహారంతో పాటు తల్లిపాలను రెండు సంవత్సరాల వరకు ఇవ్వాలని దానివల్ల మహిళలలో బ్రెస్ట్ క్యాన్సర్ ను నివారించవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏ సి డి పి ఓ విజయరాణి ఏఎన్ఎం అనూష, మహిళా పోలీస్ ఆనందలక్ష్మి, అంగన్వాడి వెల్లటూరు సెక్టార్ లీడర్ గృహలక్ష్మి,వెల్లటూరు పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## తల్లిపాలు వారోత్సవాలనీ ప్రారంభించిన సిడిపిఓ సిహెచ్ భారతి

**దర్శి, ఎన్ పవర్ ఆగస్టు 2**

మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో 1వ తేదీ నుండి 8వ తేదీ వరకు జరుగు తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం సిహెచ్ భారతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న పిల్లలకి ప్రభుత్వం ఇచ్చే అన్ని వస్తువులను ఏర్పాటు చేయాలని. అన్నిటిని అంద చేయాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ అనురాధ,కే శ్రీనివాసులు,ఏఎన్ఎం జి కరుణ, ఎమ్మెల్ హెచ్ పి ఈ సరళ,హెల్త్ అసిస్టెంట్ ఎన్ జ్యోతి బాబు,హెచ్ ఎం సుబ్బరత్తమ్మ, ఏ డబ్ల్యు డబ్ల్యు లు ఎన్ పద్మావతి, పి ప్రమీల,ఏ జ్యోతి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# మాదిగల చిరకాల స్వప్నం నెరవేరింది

## ఒక చరిత్రాత్మకమైన తీర్పు -మాదిగ అమరవీరుల త్యాగాల ఫలితమే యస్. సి. ల వర్గీకరణ





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 2**

మాదిగల చిరకాల స్వప్నం నెరవేరిందని యం యస్.పి. రాష్ట్ర కార్యదర్శి పూలుగుజ్జు ఫ్రాంక్లిన్ మాదిగ అన్నారు, ;స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ఎన్నో అవమానాలకు గురి అవుతూ కనీసం కులం పేరు చెప్పుకోవడానికి ఎన్నో ఇబ్బందులు పడుతున్న తరుణంలో మంద కృష్ణ మాదిగ 1994 సంవత్సరం రిజర్వేషన్ పోరాట సమితి స్థాపించి యస్. సి. లకు కూడా బి.సి. లో వలె ఎ.బి.సి. డి. వర్గీకరణ చేయాలని ప్రభుత్వాల మీద అనేక పోరాటాలు చేసి అంతిమంగా భారత దేశ ధర్మాసనం సుప్రీంకోర్టు ఎస్సీల వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అంటూ వర్గీకరణ చేసుకునే అధికారం రాష్ట్రాలకు ఉంటుందని ఒక చరిత్రాత్మకమైన తీర్పును ఇచ్చిన నేపథ్యంలో మందకృష్ణ మాది 30 సంవత్సరాల పోరాట ఫలితంగా ఎన్నో అడ్డంకులను అధిగమించి ఎంతోమంది మాదిగ అమరవీరుల త్యాగాల ఫలితంగా న్యాయమైన డిమాండ్ సాధించడం జరిగిందన్నారు. మాదిగ జాతి చిరకాల ఆకాంక్ష అయినటువంటి ఎస్సీల వర్గీకరణ సాధించి పెట్టినటువంటి మాదిగ జాతి మహాత్ముడు సామాజిక న్యాయ పితామహుడు మందకృష్ణ మాదిగ కు కృతజ్ఞతలు తెలియజేస్తూ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ;ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు గుర్రం బాబురావు మాదిగ, కొండేపోగు దేవ ప్రభాకర్ మాదిగ, బొప్పూరి ప్రసాద్ మాదిగ, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షులు కొమ్ముసూరి వెంకటేష్ , కార్యదర్శి బొమ్ము బాలు మాదిగ సీనియర్ నాయకులు పందిటి రజనీ కుమార్ మాదిగ, చెరుకుపల్లె లక్ష్మయ్య మాదిగ , కువ్వారపు శ్యాంబాబు మాదిగ, బైనాగారి ప్రభాకర్, వినుకొండ చిన్న, కొమ్ముసూరి ఓబయ్య, సుధాకర్, సుందర రావు, భైనగారి మధు, కొమ్ముసూరి ఎలీషా, గుర్రం ప్రసాద్ , కృపయ్య, రాజు, దుగ్గెపోగు రామయ్య, దాసరి. అల్లూరయ్య, రంగారావు, రాజు, జయన్న తదితరులు పాల్గొన్నారు.

## కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలుస్తాను

### బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ..





**పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్ బాపట్ల ఆగస్టు 2**

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం కృషిచేస్తోంది. గత ఐదేళ్లు ఎలాంటి భరోసా లభించక సామాన్యులు అనేక కష్టాలు ఎదుర్కొన్నారు. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక సతమతమయ్యారు. అలాంటివారు బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ని వారి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలు నేరుగా కలిసి తమ సమస్యలను విన్నవిస్తున్నారు. పెన్షన్ ల కోసం వృద్ధులు, వికలాంగులు, మహిళలు, ఉద్యోగాల కోసం యువత,విద్య, వైద్య సాయం కోసం సామాన్యులు, తాము ఎదుర్కొంటున్న కష్టాల నుంచి గట్టెక్కేందుకు బాధితులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. గత ఐదేళ్లలో వైసీపీ పాలకుల బాధితులే ఎక్కువమంది తమకు న్యాయం చేయాలని రావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి విజ్ఞప్తి స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి ఆయా విభాగాలతో సమన్వయం చేసుకుని వీలైనంత తొందరగా అందరి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ప్రజల అర్జీలు ఎంతమేరకు పరిష్కారం అయ్యాయి, వాటి స్టేటస్ ను ఎప్పటికప్పుడు తెలియజేయాలని అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు..

## పేకాటరాయుళ్ల అరెస్ట్



**పొదిలి, పెన్ పవర్ ఆగస్టు 2**

మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో పొదిలి పోలీసులు శుక్రవారం నాడు దాడి జరిపి పేకాటాడుతున్న ఐదుగురుని అదుపులోకి తీసుకున్నారు వారి వద్ద నుండి 44, 250 రూపాయలు నగదు కూడా స్వాధీనపరుచుకున్నారు ఈ సందర్భంగా ఎస్ ఐ కోటయ్య మాట్లాడుతూ పేకాట, కోడిపందాలు నిర్వహించడం, ఆడటం చట్టరీత్యా నేరం అన్నారు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నప్పటికీ, కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ ఐ కోటయ్య హెచ్చరించారు పేకాటలో పట్టుబడిన వారిపై కేసు నమోదు చేయడం జరిగిందని, నిందితులను స్థానిక కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

## డి.జి.పి.ని కలిసిన చీరాల ఎమ్మెల్యే కొండయ్య



**చీరాల, ఆగష్టు 02,పెన్ పవర్:**

మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు, డిజిపి సిహెచ్.ద్వారకా తిరుమలరా వుని, చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్క ను అందజేసి శుభాకాం క్షలు తెలియజేశారు.

# పంటల మార్పిడితో రైతుకు ఎంతో మేలు

### మండలవ్యవసాయ అధికారి షేక్.అబ్దుల్ రఫీ

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 2**



రాచర్ల మండలంలోని అనుముల పల్లి గ్రామంలో ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన పత్తి 'కొర్ర పంటలను మండల వ్యవసాయ అధికారి షేక్.అబ్దుల్ రఫీ సందర్శించారు, ప్రస్తుతం పత్తి పంటలో రసం పీల్చే పురుగులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు, పత్తి పంటను ప్రతి రెండు నుండి మూడు సంవత్సరములకు ఒకసారి జొన్న సజ్జ లాంటి పంటలతో పంట మార్పిడి చేయాలని తెలిపారు, తెల్ల దోమకు ఆశ్రయమిచ్చే తుత్తూరు బెండ కలుపు మొక్కలను పొలం గట్ల మీద లేకుండా సకాలంలో నిర్మించాలని తెలిపారు, రసం పీల్చే పురుగుల నివారణకు ముందుగా 5% వేప గింజల కషాయము లేదా వేప నూనె 5 ఎం ల్ లీటర్ నీటికి కలిపి పది రోజులకు ఒకసారి పిచికారి చేయవలెనని తెలియజేశారు, అధిక మోతాదులో నత్రజని ఎరువులను వాడకూడదని, పంట విత్తిన 30, 45 రోజులప్పుడు కాండంపై పూత మోనోక్రోటో ఫాస్ ' నీరు 1:4 నిష్పత్తిలో మరియు 60 రోజులు అప్పుడు ఇమిడాక్లోరోఫిడ్ , నీరు 1:20 నిష్పత్తి మొక్క లేత కాండానికి బ్రష్ తో పూస్తే రసంపీల్చే పురుగులను అదుపులో ఉంచుతుందని తెలిపారు,పసుపు రంగు జిగురు అట్టలు ఎకరానికి 20 చొప్పున పొలంలో అమర్చడం వల్ల తెల్ల దోమను ఆకర్షించడం ద్వారా నివారించవచ్చునని తెలిపారు, అలాగే నీలిరంగు జిగురుఅట్టలు ఎకరానికి 20 చొప్పున పొలంలో అమర్చడం వలన తామర పురుగులు ఉధృతి ని నివారించవచ్చునని తెలిపారు, మందులు పిచికారి చేసేటప్పుడు ఒక లీటరు మందు నీటికి 0.5 గ్రాములు డిటర్జెంట్ సరుపు కలిపి వాడాలని తెలియజేశారు, సింథటిక్ పైరిత్రాయిడ్ మందులను పత్తి పంట చివరి దశలో మాత్రమే పిచికారి చేసుకోవాలని లేకపోతే రసం పీల్చే పురుగుల ఉధృతి పెరుగుతుందని తెలిపారు అలాగే పత్తి పంటలో గులాబీ రంగు పురుగు యాజమాన్య పద్ధతులను గురించి రైతులకు వివరించారు, ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి. సంపత్ కుమార్, రైతు సేవ కేంద్ర సిబ్బంది వెంకటరమణ మరియు గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

## దర్శి అభివృద్ధి నా ధ్యేయం వెనుకబడిన జిల్లాల అభివృద్ధిలో ప్రకాశం జిల్లాకు పెద్ద పీఠం

## అందుకు కృషిచేసిన ఎంపీ మాగుంటకు కృతజ్ఞతలు తెలిపిన గొట్టిపాటి లక్ష్మి



**దర్శి పెన్ పవర్ ఆగస్టు 2**

దర్శి అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశం జిల్లా అని చేర్చటం కు, అవసరమైన నిధులను మంజూరు కు కృషిచేసిన మన ప్రియతమ నాయకులు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాస్ రెడ్డి కి మన కూటమి ఎంపీల బృందానికి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి డాక్టర్ కడియాల లలిత సాగర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి డాక్టర్ కడియాల లలిత్ సాగర్ లు ఒంగోలు పార్లమెంట్ పరిది లోని ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్చార్జిలు తో కలిసి ఢిల్లీ వెళ్లి నియోజకవర్గంలోని సమస్యలను వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 60 రోజుల్లో అనేక అద్భుతాలు సాధించామన్నారు. ముఖ్యంగా వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశం జిల్లా చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దర్శి నియోజకవర్గంలో అనేక ప్రాంతాలు వెనుకబడి కనీస వసుతులకు దూరంగా ఉన్నారని గొట్టిపాటి లక్ష్మి వివరించారు. వెనుకబడిన దర్శి ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు మన ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి సంపూర్ణంగా సహకరిస్తారని హామీ ఇచ్చారన్నారు. దర్శి అభివృద్ధికి వెనుకబడిన జిల్లాల లో ప్రకాశం చేరడం మనకు శుభ పరిణామం అని ఆమె అభిప్రాయపడ్డారు. మన గౌరవ ఎంపీ శ్రీనివాసరెడ్డి గారితో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి, మన ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారికి, ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా దర్శి ప్రాంతంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం వచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు అవసరమవుతాయని అందుకు సంబంధించిన ప్రణాళికలు అధికారులు ద్వారా సిద్ధం చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా ఫ్లోరిడ్ నివారణకు పైలట్ ప్రాజెక్టు గా తీసుకోవాలన్నారు దొనకొండ ప్రాంతంలో వలసలను నివారించేందుకు ఆ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములను వినియోగించుకొని పారిశ్రామిక అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలను కల్పించాలని కూడా కోరారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా అటు కేంద్ర ప్రభుత్వం, ఇటురాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వివరించారు. ఢిల్లీలో ఒంగోలు పార్లమెంట్లోని మన పార్టీ శాసనసభ్యులు ఇన్చార్జులు కలిసి వచ్చి అభినందనలు తెలిపామని వివరించారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధిలో ఢిల్లీ పర్యటన ఎంతో ఉపకరిస్తుందని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆశాభవం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమం లో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు , జిల్లా ఎమ్మె ల్యేలు... దామచర్ల జనార్దన్ గారు, డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య తదితరులు ఉన్నారు.


## ఇంటింటికి వెళ్లి లెప్రసీ సర్వే తీరును పరిశీలించిన జిల్లా వైద్య అధికారి సురేంద్రబాబు

### పీ. హెచ్.సీలో పలు రికార్డులు పరిశీలన

**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్ట్ 02**

మండలం కేంద్రమైన గుడ్లూరులో జరిగిన లెప్రసీ సర్వే తీరును గ్రామ సచివాలయం-2 పరిధిలో గల మిట్టపాలెం ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి జిల్లా న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ (డీ.ఎన్.ఎం.ఓ) డాక్టర్ సురేంద్రబాబు స్థానిక వైద్య అధికారులు, సిబ్బందితో కలసి శుక్రవారం పరిశీలించారు. లెప్రసీ అనుమానితులకు నిర్ధారణ పరీక్షలు, వారికి కావాల్సిన వైద్య సదుపాయాలను అక్కడి సిబ్బందితో చర్చించి, వాటిని వివరించాలని సూచించారు. తొలుత స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకున్న జిల్లా న్యూక్లియర్ అధికారి డా:సురేంద్రబాబు పీ. హెచ్.సీలో గల పలు రికార్డులను పరిశీలించారు. మండలంలో జరుచున్న ఎల్.సీ.డీ.సీ సర్వే విధానమును, అమలుజరిగిన తీరును పరిశీలి%ళి%చుటకు ,





మరియు సర్వే ఫారములను లను తనిఖీ చేశారు. జులై 18వ తేదీ నుండి ఆగస్టు 2వ తేదీ వరకు గృహముల యందు జరిగిన లేప్రసి కేసుల అనుమానితులను మండలం లో నమోదు చేసిన సర్వే ఫారములను క్షుణ్ణంగా పరిశీలన సురేంద్రబాబు చేయడం జరిగినది. అనంతరం గుడ్లూరు గ్రామంలోని మిట్టపాలెం ప్రాంతంలో కొన్ని గృహాలను, గృహములలోని వ్యక్తులను , కలుసుకొని సిబ్బంది చేయుచున్న లెప్రసి సర్వే ను గురించి డీ.ఎన్.ఎం.ఓ సురేంద్రబాబు స్వయంగా తెలుసుకోవడం జరిగినది. సర్వే తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరసింహులు, ఫిజియోథెరపిస్ట్ కె.వెంకటేశ్వర్లు, డీపీఎంఓ, సీహెచ్ఓ భాస్కరరావు, ఏ.ఎన్.ఎం కవల కుమారి, ఎం.ఎల్.హెచ్. పీ. పావని, ఆశా కార్యకర్తలు, పీ. హెచ్.సీ సిబ్బంది, ఫార్మాసిస్ట్ లలిత తదితరులు పాల్గొనడం జరిగినది.

## సామాజిక సేవలను గుర్తించి దారా శ్రీనివాసులకు డాక్టరేట్



**కావలి పెన్ పవర్ ఆగస్టు 2**

కావలి పట్టణంలో సామాజిక సేవలో నిరంతరం పనిచేస్తూ ఎవరికీ ఎక్కడ ఆపదలో ఉన్న నేను ఉన్నాను అంటూ సహాయం అందిస్తూ ఉన్న దారా. శ్రీనివాసులకు తను చేసిన సేవకు గుర్తింపుగా ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ మరియు విజయ్ హెల్పింగ్ ఫౌండేషన్ సంస్థలు హైదరాబాదులోని రవీంద్రభారతి లో జరిగిన కార్యక్రమంలో దారా శ్రీనివాసుల్ని స్వచ్ఛంద సేవా సంస్థలు తనకు డాక్టర్ గౌరవాన్ని ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ని అందించడం జరిగింది. తను గతంలో జానపద కళాకారులుగా రాజకీయంగా మరియు భారతీయ జనతా పార్టీలో సాంస్కృతిక శాఖ జిల్లా కార్యదర్శిగా, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా, ఎస్సీ మోర్చా స్టేట్ కార్యవర్గ సభ్యులుగా ప్రస్తుతం ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ ఉమెన్ రైట్స్ లో ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్గా నియమించ తను చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు అందించడం ఎంతో సంతోషంగా ఉందని స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్ దారా శ్రీనివాసులు తెలిపారు, అనంతరం ఆయన మాట్లాడుతూ, కావలి నియోజకవర్గం చుట్టుపక్క ప్రాంతాల్లో జానపద నృత్యాలతో అలాగే పార్టీలతో సంబంధం లేకుండా ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందని, తను చేసిన సేవలకు గుర్తింపు ఫలితంగా ఈ అవార్డు రావడం నాకు ఎంతో సంతోషంగా ఉందని, ఈ అవార్డు ఇచ్చి ఇంకా నాకు బాధ్యతను పెంచారని రాబోయే రోజుల్లో ఇంకా సేవా కార్యక్రమాలు చేసేందుకు బాధ్యత కల్పించారని, నా మీద నమ్మకం ఉంచి నాకు ఈ బాధ్యత చెప్పిన వారికి కృతజ్ఞతలు తెలుపుతూ, అందరికీ అందుబాటులో ఉండి వీలైనంత వరకు నా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

## పుట్టిన బిడ్డకు తల్లిపాలే అమృతం

### సూపర్వైజర్ సునంద



**చీరాల, ఆగస్టు 02,పెన్ పవర్**

పుట్టిన బిడ్డకు తల్లిపా లే అమృతం అని, పుట్టిన వెం టనే తల్లిపాలు పట్టించాలని, ఐసిడిఎస్ సూపర్వైజర్ బి.సు నంద అన్నారు.తల్లిపాల వారో త్సవాల కార్యక్రమంలో భాగం గా, వేటపాలెం ప్రాజెక్టు పరిధి లోని చీరాల రూరల్ నందు, వాడరేవు సెక్టార్ వాడరేవు 2 అంగన్వాడి సెంటర్ నందు, తల్లిపాల ఆవశ్యకతను వివ రిస్తూ, నిర్వహించిన అవగాహ నా ర్యాలీని, సూపర్వైజర్ సు నంద ప్రారంభించారు. ఈ సం దర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలను మాత్రమే పట్టించాలని, తల్లిపాలను బిడ్డకు రెండుసంవ త్సరాల వచ్చేవరకు కొనసాగిం చాలని,తదితర పలు అంశాల ను వివరించారు.తొలుత తల్లి పాల వారోత్సవాల వాల్ పోస్ట ర్స్, కరపత్రాలను ఆవిష్కరించి, తల్లులకు అవగాహన కల్పించా రు. కార్యక్రమంలో సూపర్వైజర్ బి.సునందతో పాటు, యమ్ ఎ ల్ హెచ్ పి ఒ.భవాని, అంగన్వా డీ కార్యకర్తలు పి.ప్రమీలారాణి, జి.విజయ ఝాన్సీరాణి, బి.సు జాత, జె.లక్ష్మి, యం.నాగ ఉషా రాణి, యం.సత్యవతి, అంగ న్వాడీల పరిధిలోని చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## ఐ.ఆర్.సి.టి.సి. ఆధ్వర్యంలో 12 రోజుల జ్యోతిర్లింగ దర్శన యాత్ర..

**స్టాఫ్ రిపోర్టర్,పెన్ పవర్,ఒంగోలు, ఆగస్ట్,2**

భారతీయ రైల్వే అనుబంధ సంస్థ అయిన ఐఆర్సిటిసి ఆధ్వర్యంలో జ్యోతిర్లింగ దర్శన యాత్ర , భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు (28)ను నడుపుతున్నట్టు ఐ.ఆర్.సి.టి.సి. ఏరియా మేనేజర్ ఏం.రాజా తెలియజేశారు.ఆగస్టు 17 నుండి ఆగస్టు28 వరకు 12 రోజుల పాటు జ్యోతిర్లింగ దర్శన యాత్ర సాగుతుందని తెలిపారు.ఉజ్జయిని (మహాకాళేశ్వర్ అండ్ ఓంకారేశ్వర్), ద్వారక (నాగేశ్వర్), సోమనాథ్ (సోమనాథ్) పూణే (భీమా శంకర్), నాసిక్ (త్రయంబకేశ్వర్), ఔరంగాబాద్ (రిష్లేశ్వర్) లలో యాత్ర కొనసాగుతుందని తెలిపారు.స్లీపర్ క్లాస్ ఒక వ్యక్తికి 20,590, త్రాడేసి 33,015 ,మరియు సెకండ్ ఏసి 43,355 రూపాయలుగా టికెట్ ధరలు రూపొందించామని తెలియజేశారు.ఈ రైలులో ట్రైన్ జర్నీ, నైట్ స్టే, వాషింగ్ చేంజ్ , హోటల్ వసతి తో పాటు రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలియజేశారు. ప్రతి కోచ్ కి ఒక ఎస్కార్ట్, సెక్యూరిటీతో పాటు సీసీ కెమెరాలు ఉంటాయని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9281030714 మరియు 9281495848 నంబర్లకు సంప్రదించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగస్తులు ఎల్టిసి సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం విజయవాడలోని ఐఆర్సిటిసి కార్యాలయంలో వివరాలను తెలుసుకోవచ్చని ఐ.ఆర్.సి.టి.సి.ఏరియా మేనేజర్ రాజా తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ప్రసాద్ స్టేషన్ మాస్టర్ డి.ఏసు పాదం, ఐఆర్సిటిసి సిబ్బంది అవినాష్, సాయి,బాలాజీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# గంజాయికి వ్యతిరేకంగా పెదవలస వారపు సంతలో ర్యాలీ

**మత్తు పదార్థాలు వద్దు నాణ్యమైన విద్య ముద్దు**

**ఆపరేషన్ పరివర్తనలో భాగంగా విద్యార్థులకు అవగాహన**

**సీఐ అప్పలనాయుడు,ఎస్సై అప్పలసూరి**

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 2:**

అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదని గూడెం కొత్తవీధి సీఐ బి.అప్పలనాయుడు,ఎస్సై కే. అప్పలసూరి కోరారు.గూడెం కొత్తవీధి మండలం పెదవలస గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న జిటిడబ్ల్యూ ఏ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ బి.అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమ దృష్టి అంతా చదువుపైనే ఉండాలని ఎటువంటి మత్తు పదార్థాల జోలికి వెళ్ళరాదని ఆయన కోరారు.మత్తు పదార్థాలు వాడడం వలన చిన్నతనములోనే జీవితాలు చిన్నాభిన్నం అవుతాయని అంతేకాకుండా కుటుంబ పరిస్థితులు తారుమారు కాగలవని ఆయన తెలిపారు. అల్లూరి జిల్లా పోలీసు యంత్రాంగం గంజాయి నిర్మూలన దిశగా చేపట్టిన ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రాంతాలను ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని,దీనిని దృష్టిలో పెట్టుకొని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ తమ దృష్టి



అంతా నాణ్యమైన చదువుపైనే కేంద్రీకరించాలని పాఠశాల ఆవరణలో గాని,బయట ప్రాంతాలలో గాని మత్తుమందులు వినియోగం చేయరాదని అటువంటి తప్పుడు పనులకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఎవరైనా పాఠశాల ప్రాంతంలో గాని బయట ప్రాంతాల్లో గాని మత్తు పదార్థాలు అమ్మిన వారిపై కూడా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంతంలో అధికంగా జరుగుతున్న గంజాయి అక్రమ రవాణాలో విద్యార్థులు ఎటువంటి పాత్ర వహించరాదని అలా చేయడం వలన వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని అందువల్ల ముఖ్యంగా విద్యార్థి దశ నుండే గంజాయి,నాటు సారా వంటి మత్తు





పదార్థాలకు దూరంగా ఉండాలని సిఐ అప్పలనాయుడు కోరారు. అనంతరం పెదవలస జిటిడబ్ల్యూఏ స్కూల్ విద్యార్థులతో మత్తు ప్రదార్థాల వినియోగం వలన జరిగే అనర్థాల గురించి వివరిస్తూ భారీ ఎత్తున సంతలో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గూడెం కొత్తవీధి స్టేషన్ ఎస్ఐ అప్పలసూరి, పెదవలస అవుట్ పోస్ట్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## వినూత్నరీతిలో నిరసన తెలిపిన పాఠశాల విద్యార్థులు





**అరకులోయ, పెన్ పవర్ ఆగస్టు 2**

అరకులోయ మండలం సుంకరమెట్ట పంచాయతీ, ఆదివాసీ పిరిబంధ పివిటీజి గ్రామంలో నూతన పాఠశాల భవనం మంజూరు చెయ్యాలని, శుక్రవారం వినూత్న రీతిలో నిరసన తెలిపిన పాఠశాల విద్యార్థులు, వివరాలు ఇలా ఉన్నాయి, మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ పిరిబంధ పి వి టి జి గ్రామములో గిరిజన ప్రాథమిక పాఠశాల 2022 సంవత్సరంలో భారీ వర్షం కారణంగా శిథిల వ్యవస్థలో ఉన్న పాఠశాల భవనం కూలిపోయింది, ప్రస్తుతానికి గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు చందా వసూలు చేసి స్వచ్ఛందంగా పాఠశాల గుడిసెను నిర్మించారు, అయితే గత వైసిపి ప్రభుత్వం వాటిని గుర్తించి నూతన భవనం మంజూరు చేయలేదని స్థానిక గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా నూతన కూటమి ప్రభుత్వం చొరవతో,మహాప్రభో ప్రభుత్వానికి రెండు చేతులు జోడించి ఎత్తి నమస్కరిస్తు, మోకాళ్ళు క్రిందకు పెట్టి, నమస్కరిస్తూ పాఠశాల నూతన భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు, ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు గత్తుం బుజ్జి బాబు మాట్లాడుతూ అరకులోయ మండలం సుంకరమెట్ట పంచాయతీ పిరిబంద గ్రామంలో 75 పివిటీజి కుటుంబాలు నివసిస్తున్నారని, పాఠశాలలో సుమారు 30 మంది విద్యార్థులు విద్యాను అభ్యసిస్తున్నారని,2022 సంవత్సరంలో తుపాను కారణంగా పాత పాఠశాల భవనం కూలిపోయిందని, ఇప్పటికీ నూతన భవనం ప్రభుత్వం మంజూరు చేయలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు, గతంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందన మీకోసం కార్యక్రమంలో సర్పంచ్ కలెక్టర్ కు పిర్యాదు చేసిన ఇప్పటికీ ప్రభుత్వ అధికారులు స్పందించలేదని,ప్రస్తుతం స్వచ్ఛందంగా చందాలు వేసుకొని విద్యార్థుల తల్లిదండ్రులు నిర్మించిన రేకుల షెడ్డులో తరగతులు నిర్వహిస్తున్నారని తక్షణమే ప్రభుత్వ అధికారులు స్పందించి నూతన పాఠశాల భవనం నిర్మాణం చేపట్టాలని సిపిఎం గిరిజన సంఘం నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు,ఈ కార్యక్రమం ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు పి.నాని బాబు సుంకర మెట్టు సర్పంచ్ గెమ్మెల చిన్న బాబు గ్రామస్తులు శారదా, నర్సమ్మ,అరషో పిల్లల తల్లి దండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## గుమ్మల్లగొంది గ్రామంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం

**ఎంపీడీవో ఉమామహేశ్వరరావు**





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 2**

అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని గుమ్మల గొంది గ్రామంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం కింద ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని గూడెం కొత్తవీధి మండల అభివృద్ధి అధికారి ఉమామహేశ్వరరావు తెలిపారు.ఈ మేరకు గ్రామపంచాయతీ పరిధిలోని సచివాలయ సిబ్బంది, ఐసిడిఎస్,గూడెం కొత్తవీధి హెల్త్ సిబ్బంది సమక్షంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని,ఈ కార్యక్రమం కింద మండలంలోని అన్ని ప్రాంతాలలో ఉన్న మంచినీటి ట్యాంకులు క్లీనింగ్ మరియు గ్రామాలలో శానిటేషన్ వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని వీటిని మండల ఈవోఆర్డి పాపారావు సమక్షంలో పరిశీలించడం కార్యక్రమాల నిర్వహణ చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు.గత నెల 25 నుండి ఆగస్టు 10 వరకు మండలంలో అన్ని ప్రాంతాలలోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు.

# వైసిపి నాయకుడు ఇంటిని కూల్చేస్తారంటూ ప్రచారం

## అండగా నిలబడ్డ వైసిపి శ్రేణులు –స్టే రావడంతో వెనక్కి తగ్గిన అధికారులు






**నర్సీపట్నం, పెన్ పవర్ (ఆగష్ట్ 02) :**

పట్టణంలోనే ఓవైసీపీ నాయకుడి కట్టడాన్ని కూల్చి వేయడానికి అధికారులు సిద్ధమయ్యారన్న ఓ విశ్వసనీయ సమాచారం మేరకు మున్సిపాలిటీలో నాయకులందరూ అప్రమత్తమయ్యారు. నర్సీపట్నం మున్సిపాలిటీలో 26 వార్డుకు చెందిన చిటికెల కరుణాకర్ అలియాస్ కన్నా కు సంబంధించిన కట్టడాన్ని కూల్చేందుకు రంగం సిద్ధమైందన్న విశ్వసనీయ సమాచారం మేరకు మున్సిపాలిటీలో వైసీపీ నాయకులందరూ తెల్లవారుజామున నాలుగు గంటలకే కన్నాకు అండగా నిలబడ్డారు. అత్యవసర సమావేశం మేరకు విజయవాడ ప్రయాణమైన మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ కూడా తన ప్రయాణాన్ని మానుకొని చిటికెల కన్నాకు అండగా సంఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే తెల్లవారుజాము నుండి అనేక నాటికి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఉదయమే 8 పోలీస్ స్టేషన్ల నుంచి సిబ్బందిని రప్పించడం జరిగింది. అదేవిధంగా మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా సమావేశమయ్యారు. కానీ మధ్యాహ్నం వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మధ్యాహ్నం రెండు గంటల వరకు మున్సిపాలిటీ నాయకులందరూ అక్కడే వేచి ఉన్నారు. రెండు గంటల తర్వాత ఈ కట్టడానికి సంబంధించి హైకోర్టు నుండి స్టే రావడంతో, వాటికి సంబంధించిన కాపీలను మున్సిపల్ కార్యాలయానికి అందజేశారు. ఈ సంఘటనకు సంబంధించి ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ మీడియాతో మాట్లాడుతూ 1977లోనే లాలం రాధాకృష్ణ నుండి ఈ ఆస్తిని కొలుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ ఆస్తికి సంబంధించి కరెంట్ బిల్లు, పన్నులు కడుతున్నారని తెలిపారు. అయినప్పటికీ మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చారని, నోటీస్కు సమాధానం ఇచ్చినప్పటికీ రెండో నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నోటీసు పై హైకోర్టును ఆశ్రయించగా స్టే వచ్చిందన్నారు. అయితే అన్ని పత్రాలు, అన్ని హక్కులు ఉన్నప్పటికీ అధికారులు ఈ విధంగా వేధింపులకు దిగడం సరికాదన్నారు. కన్నాకు అండగా నిలబడిన నాయకులందరికీ గణేష్ కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ఏ నాయకుడికి, కార్యకర్తకు కష్టం కలిగిన ఇదేవిధంగా స్పందిస్తామన్నారు. ఒక విధంగా ఇటీవల ఎన్నికలలో అనూహ్య ఓటమి తరువాత, ఒక్కసారిగా నాయకులలో, కార్యకర్తల్లో చైతన్యం వచ్చింది. తమ సహచర మిత్రుడు పై వేధింపు చర్యలు చేపడుతున్నారనే సమాచారం తెలియగానే వైసిపి నాయకులందరూ ఒకటయ్యారు. ఎవరికి కష్టం వచ్చినా ఇదే విధంగా స్పందించాలని నిర్ణయానికి వచ్చారు. సంఘటనా స్థలం వద్ద మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ తో పాటు చింతకాయల సన్యాసిపాత్రుడు, మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, గొలుసు నరసింహమూర్తి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఏకా శివప్రసాద్, చింతకాయల వరుణ్, వైసిపి కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అయితే అత్యంత కీలకమైన సమాచారం మేరకు అదే వార్డులో ఓ టిడిపి నాయకుడు ఇంటిని కూల్చివేసేందుకు కోర్టు నుండి ఆదేశాలు వచ్చాయని, దానిని కూలగొట్టేందుకే అధికారులు సిద్ధమయ్యారని, టిడిపి పెద్దల నుండి వచ్చిన ఒత్తిడి మేరకు అధికారులు వెనక్కి తగ్గినట్లు సమాచారం. దీనిపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## అభివృద్ధికి ఆ నేత అడ్డు...!

**జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనిని మాజీ ఎంపీపీ అడ్డుకోవడం పై గ్రామస్తుల అభ్యంతరం**



**కొయ్యూరు పెన్ పవర్ ఆగస్టు 2**

ఏ ప్రభుత్వం హయాం లోనైనా, ఏ గ్రామంలోనైనా, అభివృద్ధి పనికి అన్ని పార్టీల నేతలు సహకరించాల్సిందే అయితే ఇందుకు భిన్నంగా ఆ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనిని స్వయాన అధికార కూటమి నేత ఒకరు అడ్డుకునే పని చేయడంపై సర్వత్ర నిరసన వ్యక్తం అవుతుంది. వివరాలు ఇలా ఉన్నాయి మండలంలోని మర్రివాడ పంచాయతీ గుడ్లపల్లి రోడ్డు నుంచి పిడతా మామిడి గ్రామం వరకు గ్రావిల్ రోడ్డు నిర్మాణానికి గాను సుమారు 35 లక్షల నిధులు గత ప్రభుత్వ హయాంలో మంజూరు అయ్యాయి. ఈ మేరకు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ అప్పట్లో సుమారు 40% మేర నిర్మాణం పనులు పూర్తి చేశారు. అనివార్య కారణాలవల్ల గత రెండు సంవత్సరాలుగా పనిని నిలుపుదల చేశారు అయితే ఇప్పుడు ప్రస్తుతం కాంట్రాక్టర్ పనిని పూర్తిచేసేందుకు సన్నిద్ధం అవుతున్నందున గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నందున మర్రివాడ మాజీ ఎంపీటీసీ, మాజీ ఎంపీపీ, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, గొలిసింగి సత్యనారాయణ అడ్డుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తులు అలాగే సర్పంచ్ మాదల సత్యవతి మాజీ సర్పంచ్ మాదల చిన్నారావు తదితరుల ఫిర్యాదు మేరకు ఎంపీపీ బడుగు రమేష్ బాబు రోడ్డు నిర్మాణ పని వద్దకు వెళ్లి పనులు యధావిధిగా జరిగేలా చూడాలని ఆదేశించారు. కూటమి నేత అభివృద్ధి పనిని అడ్డుకోవడం వైసిపి నేత అడ్డుకోవడం తగదని అనడం తో ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశం అయింది.

**అభివృద్ధిని ఎవరు అడ్డుకున్న నేరస్తులే: మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి**

మండలంలోని మర్రివాడ పంచాయతీ పిడతమామిడి నుండి గుడ్లపల్లి రోడ్డు వరకు నిర్మాణం అవుతున్న రోడ్డు పనులను టిడిపి నేత గొలిసింది సత్యనారాయణ అడ్డుకుంటున్నారన్న విషయాన్ని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి దృష్టికి తేగ ఆమె స్పందిస్తూ అభివృద్ధి పనులకు రాజకీయాలకు అతీతంగా సహకరించాలని అభివృద్ధి పనులను అడ్డుకున్న వారు ఎంతటి వారైనా నేరస్తులే అని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ఎటువంటి పనులు అయినా మంజూరు అయితే వాటిని కూటమి నేతలు అందరూ కలిసికట్టుగా వాటిని పూర్తిచేసే విధంగా సహకరించాలని ఈ సందర్భంగా ఆమె అన్నారు. ఇటువంటి సంఘటనను ఏ గ్రామంలో జరగకుండా ఉండేందుకు కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు ముందుకు దూసుకుపోయేలా తన వంతు ప్రయత్నం చేస్తానని అన్నారు. కాగా మర్రివాడ పంచాయతీ లో జరిగిన ఈ సంఘటన విషయాన్ని సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుని వెళ్తానని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

# హెచ్.పి గ్యాస్ కేంద్రం మూసివేత!

# నిలచిన ఈ కేవైసీ!

**ఎటువంటి సమాచారం లేకుండా అర్ధాంతరంగా మూసివేత పై గిరిజనుల ఆగ్రహం!**

**పత్రికల్లో వచ్చిన కథనాలతో ఈ కేవైసీ నిలిపివేత**






**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 2 :**

అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండల కేంద్రంలోని హెచ్పి గ్యాస్ కేంద్రంలో ఈకేవైసీ చేయించుకోవడానికి భారీ ఎత్తున నిధులు వసూలు చేస్తున్నారని వివిధ పత్రికల్లో వచ్చిన వార్తల నేపథ్యంలో హెచ్పి గ్యాస్ కేంద్రం కార్యాలయాన్ని అర్ధాంతరంగా మూసివేశారు.ఈ కేంద్రంపై పలు ఆరోపణలు రావడంతో అప్రమత్తమైన గ్యాస్ కేంద్రం నిర్వాహకులు ఎవరికి అందుబాటులో లేకుండా మూడు రోజులపాటు గ్యాస్ కేంద్రం తెరవడం లేదని నోటీస్ బోర్డులో నోటీసు అంటించి కార్యాలయానికి గ్యాస్ కేంద్రానికి తాళాలు వేశారు.ఈ హెచ్పి గ్యాస్ కేంద్రంలో ఈకేవైసీ చేసుకోవడానికి పలు ప్రాంతాల నుండి గిరిజనులు తరలివచ్చి తాళాలు వేసి ఉండడంతో తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.తాము ఎన్నో పనులు ఆపుకొని ఈ కేవైసీ చేయించుకోవడానికి వస్తే గ్యాస్ కేంద్రం మూసివేసి ఉందని ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ఇలా గ్యాస్ కేంద్రాన్ని మూసి వేయడం పట్ల గిరిజనులు ఆవేదన ఆందోళన వ్యక్తం చేశారు.ఆగస్టు 30 తేదీ లోగా గ్యాస్ కనెక్షన్ ఈ కేవైసీ చేయించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సమయాన్ని కేటాయించిందని,అయితే ఈ గ్యాస్ కేంద్రంలో సరైన ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడంతో గ్యాస్ ఈ కేవైసీ చేయడం కష్టతరంగా అవుతుందని దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ కేవైసీ చేయించడానికి హెచ్ పి గ్యాస్ నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పలు గ్రామాల గిరిజనులు కోరారు. హెచ్.పీ గ్యాస్ ఈ కేవైసీ ఎటువంటి అదనపు నిధులు తీసుకోకుండా చేయాల్సి ఉండగా అధిక నిధులు తీసుకొని చేస్తున్నారని వచ్చిన విమర్శల నేపథ్యంలో ఈ గ్యాస్ కేంద్రాన్ని యాజమాన్యం మూసి వేసింది.అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకొని ఎటువంటి అదనపు నిధులు వసూలు చేయకుండా గ్యాస్ వినియోగదారులకి ఈ కేవైసీ ఉచితంగా చేసే విధంగా ఏర్పాటు చేయాలని పలు ప్రాంతాల గిరిజనులు కోరుతున్నారు.

# కడుతులలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహణ

**నవజాత శిశువులకు తల్లిపాలే శ్రేష్టం -తల్లిపాలు తాగిన పిల్లలకే ఆరోగ్యం, ఆనందం**

**లబ్బూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్ వైజర్ చిట్టపుల్లి భాగ్యవతి**







**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 02:**

నవమాసలు మోసి బిడ్డను కని పెంచచడంలో తల్లి పాత్ర చాలా కీలకమైందని, పుట్టిన వెంటనే బిడ్డకు స్తన్యమివ్వడం చాలా అవసరమని లబ్బూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మల్టీపర్పస్ హెల్త్ సూపర్ వైజర్ చిట్టపుల్లి భాగ్యవతి తెలిపారు. లబ్బూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల కడుతుల గ్రామంలో అంగన్వాడీ టీచర్ సిరగం పార్వతి ఆధ్వర్యంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమృత తుల్యమైన తల్లిపాల విశిష్టతను వివరిస్తూ ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుంచి 7 తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. నవజాత శిశువులకు తల్లిపాలు శ్రేష్టమని, పుట్టిన బిడ్డకు మొదటి గంటలోనే తల్లిపాలు పట్టించాలని, తల్లిపాలు మొదటి ఆరు నెలలు శిశువుకు ఎంతో శ్రేష్టమన్నారు. ప్రపంచంలో సుమారు 120 కి పై దేశంలో తల్లిపాల వారోత్సవాలు జరుపుకుంటారన్నారు. బిడ్డకు పోషకాహారాన్ని ఇవ్వడం మాత్రమే కాదు దీనివల్ల తల్లి బిడ్డల బాంధవ్యాన్ని పెంచుతుందన్నారు. పసి వయసులో తీవ్రమైన వ్యాధుల బారిన పడకుండా భద్రతను నిస్తుందని, బిడ్డ పుట్టిన వెంటనే మొదటి టికాగా తల్లిపాలే పనిచేస్తాయని, తల్లిపాలే దివ్య ఔషధం అన్నారు. ఈనెల 7 వరకు నిర్వహించే తల్లిపాల వారోత్సవాలను గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. "డబ్బా పాలు వద్దు తల్లిపాలు ముద్దు" అనే నినాదాలు చేశారు. గ్రామంలో ఫ్రైడే డ్రైడే సందర్భంగా పరిసరాలను శుభ్రపరిచారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామ ప్రజలు పరిశుభ్రంగా ఉండాలని, దోమతెరలు వాడాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జోలపుట్టు సచివాలయం ఏఎన్ఎం గౌరమ్మ, వెలుగు సిసి దేవమ్మ,ఆశ కార్యకర్త కిముడు శాంతమ్మ, అంగన్వాడి ఆయా పద్మ, గ్రామ పెద్దలు సింహాచలం, అర్జున్, గర్భిణీలు, బాలింతాలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తల్లిపాలు వారోత్సవాలో గర్భిణీలకు సీమంతాలు



**కొయ్యూరు,పెన్ పవర్ ఆగస్టు2**

బిడ్డ పుట్టినది మొదలు ఆరు నెలలు దాటే వరకు తల్లి పాలు అందించిన నాడే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యం గా ఉంటారని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి విజయకుమారి అన్నారు. తల్లి పాలు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కొయ్యూరు మండలం కంఠారం సెక్టర్ పరిధిలో ఆర్. కొత్తూరు, మల్లవరం అంగన్వాడీ కేంద్రాల్లో తల్లి పాలు వారోత్సవాలు నిర్వహించారు. మండల కేంద్రం లో పిల్లలు ఐసీడీఎస్ అధికార్లు, పలువురు అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా పి ఓ గర్భిణీ లు, బాలింతల సమావేశం లో మాట్లాడుతూ. బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు చనుబాలు పట్టించాలన్నారు. దింతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతున్నారన్నారు. శ్వాశ కు సంభంధించిన వ్యాధులు చొక కుండా ఉండే అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమం లో సూపరవైజర్ సునీతాబాలమణి, అంగన్వాడి టీచర్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాపం కొరవంగి చంద్రయ్య దీనస్థితి..

**కాలు శస్త్ర చికిత్స కొరకు దాతలు సహాయం చేయాలని వేడుకోలు**

**స్టాప్ రిపోర్టర్ పెన్ పవర్ పాడేరు/ పెదబయలు/**



**గూడెం కొత్తవీధి, ఆగస్టు 2**

అల్లూరి సీతారామరాజు పెదబయలు మండలం ఇంజరి పంచాయతీ తూలం గ్రామానికి చెందిన కోరవంగి చంద్రయ్య అనారోగ్య పరిస్థితులలో వారి కుటుంబం దీనస్థితిలో ఉండటంతో వారిని చూసిన పలువురు తీవ్ర విచారం వ్యక్తపరుస్తున్నారు. కోరవంగి చంద్రయ్యకు గత ఎనిమిది సంవత్సరాల నుండి కుడి కాలుకు దీర్ఘకాలిక వ్యాధి రావడంతో వైద్యులు మోకాలు వరకు కాలును తొలగించారు. అయితే మరల ఇప్పుడు అదే కాలుకు మోకాలు నుండి పైకి మళ్లీ పుండు ఏర్పడి మురుగుపోతుంది.భార్య ఇద్దరూ చిన్నపిల్లలతో జీవనం సాగిస్తున్న చంద్రయ్య తన కాలు మళ్లీ మురిగిపోతుండటంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నాడు.కటిక పేదరికం, ఆపై భార్య ఇద్దరు పిల్లలు.ఏమి చేయాలో తెలియని స్థితిలో మానసికంగా కృంగిపోతున్నాడు. మరల ఆపరేషన్ చేయించుకోవడానికి చిల్లిగవ్వలేని పరిస్థితి. దీంతో కుటుంబం తీవ్ర మనోవేదనకు గురి అవుతుంది. రోజురోజుకు కాలు కుళ్ళిపోతుంది.ఈయన దీన పరిస్థితిని చూసి పలువురు స్నేహితులు, ఇరుగుపొరుగువారు అతనికి ఏదైనా సహాయం చేయాలని సంకల్పించుకున్నారు. వివిధ ప్రచార మాధ్యమాలలో ఈయన యొక్క దీన పరిస్థితిని వివరిస్తున్నారు.చంద్రయ్య తనకు దాతలు సహాయం చేయాలని, మీరు సహాయం చేస్తే నా కుటుంబాన్ని బ్రతికించిన వారు అవుతారని దాతలు దయతలచి ఎంతో కొంత ఆర్థిక సహాయం అందించాలని దీనంగా అభ్యర్థిస్తున్నాడు.తనకు ఫోన్ లేదు కాబట్టి తమ కుటుంబ సభ్యుల ఫోన్ పే నెంబర్ కు దాతలు ఎంతో కొంత సహాయం చేసి నా ఆపరేషన్కు సహాయం చేయగలరని దీనంగా వేడుకుంటున్నాడు.90142 49128( బుటారి సుబ్బారావు ) నెంబర్కు ఫోన్ పే చేయాలని కోరుతున్నారు. ఈయన దీన పరిస్థితిని చూసి పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. పలువురు దాతలు సహాయం చేయాలని, మిత్రులు గ్రామస్తులు కోరుతున్నారు.

## ఆరోగ్య రక్షణ పట్ల అవగాహన కలిగి ఉండాలి






**కురుపాం ,పార్వతీపురం,పెన్ పవర్ ఆగస్టు 2**

ఆరోగ్య రక్షణ పట్ల అవగాహన కలిగి ఉండాలని రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్. దామోదర్ రావు అన్నారు. పార్వతిపురం మండలం రావికోన గ్రామంలో మండల లీగల్ సర్వీస్ కమిటీ, రెడ్ క్రాస్, లయన్స్ క్లబ్, ఐఆర్పీడబ్ల్యూఏ, డాక్టర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విజయనగరం మిమ్స్ హాస్పిటల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సౌజన్యంతో; మెగా ఉచిత వైద్య శిబిరం శుక్రవారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్. దామోదర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా దామోదర్ రావు మాట్లాడుతూ రావికోన వంటి మారుమూల గిరిజన గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం ఆవశ్యమన్నారు. సీజనల్ వ్యాధులు, మలేరియా, చిన్నపిల్లల వ్యాధులు, మహిళల గర్భ కోశ వ్యాధులు తదితర వ్యాధుల పట్ల అవగాహన కలిగించడంతో పాటు వైద్య పరీక్షలు చేయడం ముదావహం అన్నారు. మందులు ఉచితంగా అందించడం జరుగుతుందని, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు కూడా చేయుటకు అవకాశం ఉందని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని - గిరిజనులు;దీనిపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. బాగా మరిగించి చల్లార్చిన నీళ్లు తాగాలని, నిల్వ ఆహార పదార్థాలు పదార్థాలు తినరాదని ఆయన సూచించారు. మలేరియా జ్వరాలపై దృష్టి పెట్టాలని;తగు మందులు తీసుకొని జాగ్రత్తగా పడాలని ఆయన చెప్పారు. మలేరియా కు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన చెప్పారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో దోమలు భారీ పడకుండా దోమతెరలు అందజేయాలని జిల్లా; వైద్య శాఖకు ఆదేశించారు.ఈ సందర్భంగా జిపి స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. రావి కోన, చందలింగి, కొత్తవలస, అడ్డూరు వలస, ఆర్కే బట్టీ వలస గ్రామాలకు చెందిన;దాదాపు 250 మందికి వైద్య పరీక్ష నిర్వహించారు. రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్;ఎం శ్రీరాములు స్త్రీలకు హైజినిక్ కిట్లు, రేకులు; పాడైపోయిన; ఇల్లులకు టార్పాలిన్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బి ఎన్ బి రావు ఆధ్వర్యంలో సుమారు 300 పులిహోర ప్యాకెట్లు, డాక్టర్స్ కు వాటర్ బాటిల్స్ బిస్కెట్స్ టీలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్వతీపురం;జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి వాగ్దేవి, డిప్యూటీ డీ ఎం హెచ్ ఓ డా.టి జగన్మోహన్ రావు, డాక్టర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వై వివేక్, జయప్రకాష్ బాబు, అడ్డూరవలస పి హెచ్ సి; సిబ్బంది,; రావి కోన సర్పంచ్; రామస్వామి, బార్ అసోసియేషన్;ప్రెసిడెంట్; ఎన్ శ్రీనివాసరావు,; మండల్ లీగల్ సర్వీస్ కమిటీ సభ్యులు డాక్టర్ భోగేశ్వరరావ్, డాక్టర్ దుర్గాప్రసాద్, ఎన్జీవో అసోసియేషన్ ప్రెసిడెంట్; కిషోర్, డాక్టర్ మధుసూదన్, నిమ్స్ పి ఆర్ ఓ శ్రీనివాసరావు, పార్వతీపురం డాక్టర్స్, మిమ్స్ డాక్టర్స్, ఐఆర్పి డబ్ల్యూ ఏ, డైరెక్టర్ ప్రకాష్, లైన్స్ క్లబ్ సభ్యులు, రెడ్ క్రాస్ సభ్యులు, స్థానిక స్కూలు హెడ్మాస్టరకు రామారావు, కాంతమ్మ;తదితరులు హాజరయ్యారు.

## తహసీల్దార్లు సమర్థవంతమైన సేవలు అందించాలి






**కురుపాం పార్వతీపురం,పెన్ పవర్ ఆగస్టు 2**

మండలాల్లో సమర్థవంతమైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తహసీల్దార్లను ఆదేశించారు. తహసీల్దార్లతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం కలెక్టర్ సమావేశం జరిగింది. రెవెన్యూ అంశాల పట్ల సానుకూలంగా స్పందించి మంచి పరిష్కారం చేయాలని ఆయన స్పష్టం చేశారు. రికార్డులు పక్కాగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ప్రజల నుండి వచ్చే సమస్యలు మండల స్థాయిలో పరిష్కారం కావాల్సిందే అని ఆయన స్పష్టం చేశారు. సమస్యలపై ముఖ్యంగా భూసమస్యల పట్ల క్షుణ్ణంగా విచారణ చేయాలని ఆయన ఆదేశించారు. మండలాల్లో సంభవించే విపత్తులు, ఇతర సమస్యలను ముందుగా గుర్తించే విధంగా వ్యవహరించాలని ఆయన చెప్పారు. గ్రామ స్థాయి సమాచారం పక్కాగా కలిగి ఉండాలని ఆయన ఆదేశించారు. ఆర్ ఓ ఎఫ్ ఆర్, భూ సేకరణ, గృహ నిర్మాణం, తదితర అంశాలపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. పారిశ్రామిక తదితర అవసరాలకు జిల్లాలో లాండ్ బ్యాంక్ అవసరమని, అందుకు అవసరమగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక, ఇన్ ఛార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి జి కేశవ నాయుడు, పార్వతీపురం రెవిన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, పాలకొండ రెవిన్యూ డివిజనల్ అధికారి వి వెంకట రమణ, జిల్లా కలెక్టర్ కార్యాలయ విభాగ అధిపతులు పాల్గొన్నారు.

## పింగళి వెంకయ్య జయంతి వేడుకలు

**అరకులోయ, పెన్ పవర్ ఆగస్టు 2 :**

అరకులోయ మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థానిక డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ సేవ పథకం (ఎన్ ఎస్ ఎస్) అధ్యక్షతన పింగళి వెంకయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు, కళాశాల ప్రిన్సిపల్ భరత్ కుమార్ నాయక్, అధ్యాపకులు,పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఆయన స్మృతికి నివాళి అర్పించారు,ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పింగళి వెంకయ్యని జాతీయ జెండా ఆవశ్యకతను గొప్పతనాన్ని కొనియాడారు .కళాశాల చరిత్ర అధ్యాపకురాలు వై విజయలక్ష్మి మాట్లాడుతూ స్వతంత్ర ఉద్యమ కాలంలో 1906 నుంచి 1922 వరకు జరిగిన స్వతంత్ర ఉద్యమ ఘట్టాల్లో ముఖ్యమైన పాత్ర పోషించారనీ, 1916 లో భారతదేశానికి ఒక జాతీయ జెండా అనే పుస్తకాన్ని ఆంగ్లంలో రాసి ప్రచురించారన్నారు, పింగళి వంటి గొప్ప వ్యక్తి మన ఆంధ్రుడు కావడం మనకు ఎంతో గర్వకారణం అన్నారు. ఆర్ట్స్ విభాగాధిపతి పి నాగబాబు మాట్లాడుతూ పింగళి వెంకయ్య రూపొందించిన మన జాతీయ జెండాను భారత జాతీయ కాంగ్రెస్ 1921లోఆమోదించిందనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్య సి కోఆర్డినేటర్ పి కొండబాబు ఎన్ఎస్ఎస్ పిఓ యం అనిత కుమారి, అధ్యాపకులు ఎల్ఎంఎస్ గణేష్ పి సుందరి రాణి ఎస్ రాజు విశ్వేశ్వరరావు బి లచ్చన్న ఎస్ అప్పారావు కే సునీల్ ఎస్ సోంబాబు ఆర్ట్స్ విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




## వీఆర్ఏల నైట్ డ్యూటీలను ఉపసంహరించాలి

**కురుపాం పెన్ పవర్ ఆగస్ట్. 02**



వీఆర్ఏల నైట్ డ్యూటీలను వెంటనే ఉపసంహరించాలని మన్యం జిల్లా వీఆర్ఏల సంఘ అధ్యక్షులు జి. ఈశ్వరరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు .శుక్రవారం మండల కేంద్రమైన కురుపాం లో పత్రిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ వీఆర్ఎల పై రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా మోపిన నైట్ డ్యూటీలను ఉపసంహరించుకోని నిలుపుదల చేసేలోపు ప్రత్యేక అలవెన్స్ ఇచ్చి, భద్రత కల్పించాలని మహిళలతో రాత్రి పూట డ్యూటీలు వెంటనే ఆపి తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న విధంగా మన రాష్ట్రంలో కూడా పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగష్టు 3వ, తేదీ స్థానిక ఎంఆర్ లకు, ఆగష్టు 6న ఆర్ డి ఓ లకు, 9న జిల్లాకలెక్టర్లకు ఆగష్టు 14,15 తేదీలలో మంత్రులు, ఎంఎల్ఎ లకు రాయబారాలు నిర్వహించే కార్యక్రమానికి వీఆర్ఏ లందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలి

**భకాయి పడ్డ 141 కోట్లు రూపాయలు తక్షణమే చెల్లించండి -సిఐటియు డిమాండ్**



**అరకులోయ పెన్ పవర్ ఆగస్టు 2**

జిల్లాలో ఉపాధి కూలిల వేతనాలు, 9 వారాల 140 కోట్లు బకాయిలు ఉన్నాయని, తక్షణం విడుదల చేయాలని ఉపాది కూలీల యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది, శుక్రవారం అరకులోయ గిరిజన సంఘం కార్యాలయంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ బి పోతురాజు, అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు పత్రిక విలేకరులకు సమావేశంలో తెలిపారు,కూలి పనిచేసి తొమ్మిది వారాలు గడిచిన వేతనాలు చెల్లించకపోవడం దుర్మార్గమని అన్నారు. జిల్లాలో నాలుగు లక్షల 59 వేల మంది కూలీలు ఉపాధి పొందుతున్నారని సకాలంలో కూలి డబ్బులు చెల్లించకపోతే ఎలా బ్రతుకుతారని ఆవేదన వ్యక్తం చేశారు, తక్షణం రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు, ఉపాధి కూలీలకు ఆర్థికంగా ఆదుకోవాలని వారు తెలిపారు, ఉపాధి కూలీలు బకాయి పడ్డ డబ్బులు చెల్లించకపోతే పెద్ద ఎత్తున కూలీలతో కలిసి కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన చేస్తామని ప్రభుత్వా అధికారులకు హెచ్చరించారు, ఈ సమావేశంలో సంఘం నాయకులు తాముల జోషి, కొర్ర సుబ్బారావు, తదితరులు, పాల్గొన్నారు.

## గిరి రైతులకు యూరియా పంపిణీ...!



**కొయ్యూరు,పెన్ పవర్ ఆగస్టు 2**

ఖరీఫ్ సీజన్ కు సంబంధించి వరినాట్లను వేసే ముందు ఎకరానికి 25 కిలోలు, నాట్లు వేసిన నెల రోజుల తర్వాత మరో 25 కిలోల చొప్పున యూరియాను వేసుకోవాలని కొయ్యూరు మండల వ్యవసాయ అధికారిణి డీ.ఉమాదేవి రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని శింగవరం రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఉషా, మఠ్రివాడ గ్రామ ఉద్యాన సహాయకులు ఎండన్నతో కలిసి పలువురు రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ..., రైతులకు 50 కిలోల యూరియా బస్తాను, రూ.267కు అందిస్తున్నామని చెప్పారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా యూరియాను సరఫరా చేస్తామని తెలిపారు. రైతులు తమ పరిధిలోని ఆర్బీకేల వద్ద నుంచి యూరియా తీసుకోవాలని సూచించారు. అలాగే రైతులు వరినాట్లు వేసే ముందు కొనలను తుంచి నాట్లు వేయాలని, ఇలా చేయడం వల్ల ఆకు ముడత పురుగు గుడ్లను అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై రైడ్ చేసి నగదు సీజ్ చేసిన జామి పోలీసులు

**విజయనగరం, పెన్ పవర్ ఆగస్టు 02**

జామి మండలం అలమండ గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్న వారిపై రైడ్ చేసినట్లుగా జిల్లా ఎస్పీ శ్రీ వకుల్ జిందల్, ఆగస్టు 2న తెలిపారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో భాగంగా ఓపెన్ డ్రింకింగు, ఈవ్ టీజింగు, పబ్లిక్ న్యూసెన్సు చేస్తున్న వారిపైనా, పేకాట ఆడుతున్న వారిపైనా, బెట్టింగులకు పాల్పడుతున్న వారిపైనా రైడ్స్‌ను ముమ్మరం చేయాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ఇందులో భాగంగా జామి మండలం అలమండ గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్న వారిపై జామి ఎస్ఐ వీరబాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది రైడ్ చేసి, పేకాట ఆడుతున్న 7గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి పేకాటలో బెట్టింగులకు వినియోగిస్తున్న రూ. 71,600/-ల నగదును స్వాధీనం చేసినట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు.



# ఢిల్లీ సీన్ హైదరాబాద్‌లో రిపీట్ కాకూడదు.. అమీర్‌పేట్, దిల్‌షుక్‌నగర్, అశోక్‌నగర్.. బీ కేర్‌ఫుల్

ఢిల్లీలో రావుస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో జరిగిన విషాదం హైదరాబాద్‌లో రిపీట్ కాకూడదు. ఢిల్లీలోని ఓల్డ్ రాజేందర్ నగర్ లో జూలై 28న సివిల్స్ కోచింగ్ సెంటర్ బేస్ మెంట్ లోకి వరదలు వచ్చి ముగ్గురు విద్యార్థులు చనిపోయారు. ప్రమాద సమయంలో గ్రౌండ్ ఫ్లోర్ లో పదుల సంఖ్యలో అభ్యర్థులు చదువుకుంటున్నారు. రోడ్డుపై చేరిన వరద నీరు కారణంగా బేస్మెంట్ గేట్లు విరిగిపోయి అందులోకి నీరు చేరింది. జూలై 28న రాత్రంతా వారం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ గడిపారు. రెస్క్యూ టీం ఎంత ప్రయత్నించినా ముగ్గరి ప్రాణాలు పోయాయి. అయితే అదే తరహాలో హైదరాబాద్ లో అమీర్ పేట్,
ఆర్టీసీ క్రాస్ రోడ్, అశోక్ నగర్, దిల్ షుక్ నగర్ లో కూడా భారీగా కోచింగ్ సెంటర్లు ఉన్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చి ఎంతో మంది విద్యార్థులు హైదరాబాద్ లో కోచింగ్ తీసుకుంటున్నారు. ఒక్కో క్లాస్ రూంలో వందల మంది కూర్చుంటారు. స్టడీ హాల్స్ కుప్పలు తెప్పలుగా వెలిశాయి. వాటికి అనుమతులు ఉన్నాయా? వాటిలో ఎన్ని బిల్డింగులకు ఫైర్ సేఫ్టీ పర్మిషన్లు ఉన్నాయి. విపత్కర పరిస్థితుల్లో బయపడేందుకు కోచింగ్ సెంటర్లు సేఫ్టీ ప్రికాషన్లు పాటిస్తున్నాయా? GHMC అధికారులు అప్పుడప్పుడు సోదాలు చేస్తున్నారు. జరగరాంది ఏమైనా జరిగితే నష్టం భారీగా ఉంటుంది. ఇప్పటికైనా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ అధికారులు కోచింగ్ సెంటర్లపై దృష్టి పెట్టాలి. ఆ బిల్డింగుల సామర్థ్యం ఎంత.. ఎంతమంది విద్యార్థులు అక్కడ




ఉన్నారని ఆరా తీయాయి. సేఫ్టీ రూల్స్ పాటించని కోచింగ్ సెంటర్లపై యాక్షన్ తీసుకోవాలి. ఇన్ స్టిట్యూట్లు నడిపిస్తున్న సంస్థల పర్మిషన్లు చెక్ చేయాలని పలువురు విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# మంత్రి నారా లోకేశ్ ను అభినందించిన బీజేపీ నేత జీవీఎల్... ఎందుకంటే...!

నిన్న చంద్రబాబు పర్యటన వేళ మడకశిరలో సీపీఎం నేతల అరెస్ట్

పోలీసుల తీరు ఇంకా మారలేదన్న నారా లోకేశ్

సీపీఎం నేతలకు క్షమాపణ తెలుపుతూ ప్రకటన విడుదల

నారా లోకేశ్ చర్య పట్ల జీవీఎల్ స్పందన



బీజేపీ నేత జీవీఎల్ నరసింహారావు ఏపీ మంత్రి నారా లోకేశ్ ను అభినందించారు. అందుకు కారణం ఉంది. నిన్న సీఎం చంద్రబాబు మడకశిర పర్యటన సందర్భంగా పోలీసులు సీపీఎం నేతలను ముందస్తు అరెస్టులు చేశారు. దీనిపై నారా లోకేశ్ స్వయంగా సీపీఎం నేతలకు క్షమాపణలు తెలిపారు. పోలీసుల తీరు ఇంకా మారలేదని, ఇలాంటివి పునరావృతం కానివ్వబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు లోకేశ్ ఓ క్షమాపణ ప్రకటన విడుదల చేశారు. దీనిపై జీవీఎల్ నరసింహారావు స్పందించారు. "నారా లోకేశ్ గారూ... మీ శాఖలో జరిగిన తప్పు కాకపోయినా, పోలీసుల మితిమీరిన చర్యలకు ఈ సందేశంతో క్షమాపణ చెప్పారు. అలాగే, మీ విద్యాశాఖలో అనేక ప్రభుత్వ పథకాలకు తెలుగు ప్రముఖుల పేర్లు పెట్టి రాజకీయాల్లో మంచి సంప్రదాయాలకు తెరదీశారు. అందుకు అభినందనలు తెలుపుతున్నాను" అంటూ జీవీఎల్ ట్వీట్ చేశారు.

# భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

పశ్చిమాసియాలో అనిశ్చితి

అంతర్జాతీయ పరిణామాలతో కుదుపులకు గురైన మార్కెట్లు

నష్టాల బాటలో సెన్సెక్స్, నిఫ్టీ



గత కొన్ని రోజులుగా జీవనకాల గరిష్ఠాలను తాకుతూ దూసుకెళ్లిన భారత స్టాక్ మార్కెట్ నేడు కళ తప్పింది. స్టాక్ మార్కెట్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ నేడు భారీ నష్టాలు నమోదు చేశాయి. సెన్సెక్స్ ఏకంగా 885 పాయింట్లు నష్టపోయి 80,981 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా అదే బాటలో 293 పాయింట్ల నష్టంతో 24,717 వద్ద ముగిసింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం, తద్వారా నెలకొన్న ఆర్థిక అనిశ్చితి అంతర్జాతీయ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. దాంతో భారత స్టాక్ మార్కెట్ సూచీలు కూడా కుదుపులకు గురయ్యాయి. హెచ్ డీఎఫ్ సీ బ్యాంక్, సన్ ఫార్మా, కోటక్ మహీంద్రా బ్యాంక్, నెస్లే ఇండియా, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభాలు అందించాయి. మారుతి సుజుకి, టాటా మోటార్స్, విప్రో, జేఎస్ డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టాలు చవిచూశాయి.

# ప్రజాభవన్‌కు సమీపంలోని పెట్రోల్ బంకులో మంటలు

భూగర్భ ట్యాంక్ మూత తీస్తుండగా చెలరేగిన మంటలు

పరుగులు పెట్టిన ప్రజలు

మంటలను ఆర్పిన సిబ్బంది



హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు సమీపంలోని పెట్రోల్ బంకులో శుక్రవారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. భూగర్భ ట్యాంక్ మూత తీస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అక్కడున్న వారు పరుగులు తీశారు. పెట్రోల్ బంక్ సిబ్బంది మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసింది. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు, సంఘటనాస్థలానికి చేరుకుని, ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపు చేశారు.

# మెడల్ కొట్టు.. కారు పట్టు: ఒలింపిక్ విజేతలకు బిలియనీర్ సూపర్ ఆఫర్



పారిస్ ఒలింపిక్ పతక విజేతలకు ప్రముఖ వ్యాపారవేత్త, జేఎస్ డబ్ల్యూ కంపెనీ చైర్మన్ సజ్జన్ జిందాల్ బంపర్ ఆఫర్ ఇచ్చారు. పారిస్ వేదికగా జరుగుతోన్న ఒలింపిక్స్‌లో మెడల్ గెలిచిన ప్రతి భారత అథ్లెట్‌కు త్వరలో లాంఛ్ కానున్న ఎంజీ విండర్స్ కారును బహుమతిగా ఇస్తామని ప్రకటించారు. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా జిందాల్ ఈ విషయాన్ని అనౌన్స్ చేశారు.
విశ్వ క్రీడల్లో అంకితభావంతో ఆడి పతకం గెలిచిన వారి గొప్ప విజయానికి ఇది సరైన బహుమతి అని సజ్జన్ జిందాల్ అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా, పారిస్ ఒలింపిక్స్‌లో ఇప్పటి వరకు ఇండియా మూడు కాంస్య పతకాలు గెలుచుకుంది. ఈ మూడు మెడల్స్ షూటింగ్?లోనే రావడం విశేషం. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో స్టార్ షూటర్ మను భాకర్ బ్రాంజ్ మెడల్ గెల్చుకోగా.. ఇదే 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్ డ్ ఈవెంట్‌లో సరబ్ జిత్ సింగ్, మను భాకర్ జోడి కాంస్య పతకం కైవసం చేసుకుంది.
ఇక ఎయిర్ రైఫిల్ 3 ప్రొజిషన్ 50 మీటర్ల వ్యక్తిగత విభాగంలో స్వప్నిల్ కుసాలే బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నాడు. ప్రస్తుతం వీరు ముగ్గురు పారిస్ ఒలింపిక్స్ లో భారత్ తరుపున పతకాలు సాధించారు. మరి కొన్ని ఈవెంట్లలో ఇండియాకు మెడల్స్ వచ్చే ఛాన్స్ ఉంది.

# బీఎస్ఎన్ఎల్ 5జీ.. వీడియో కాల్ మాట్లాడిన కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా



ప్రభుత్వరంగ టెలికాం సంస్థ భారత సంచార్ నిగం లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఓ వైపు 4జీ సేవలను ప్రారంభిస్తూనే... మరోవైపు 5జీపైనా కూడా సన్నాహాలు చేస్తోంది. తాజాగా టెస్టింగ్ దశలో ఉన్న బీఎస్ఎన్ఎల్ 5జీ నెట్‌వర్క్‌ను కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా పరీక్షించారు. సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సీ-డీఓటీ) క్యాంపస్‌లో 5జీ ద్వారా వీడియో కాల్ మాట్లాడారు. ఈ వీడియోను తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేశారు. 'కనెక్టింగ్ ఇండియా' అనే లైన్‌తో ఈ వీడియోను షేర్ చేశారు. కాగా, ఈ ఏడాది చివరిలోగా దేశంలోని చాలా ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.ప్రైవేటు టెలికాం సంస్థలన్నీ ఇప్పటికే 5జీ నెట్ వర్క్ ను ప్రారంభించి, విస్తరిస్తుండగా... ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ ఇన్నాళ్లకు 4జీ సేవలు అందుబాటులోకి తీసుకురావడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి.

# బీఆర్ఎస్ సభ్యులపై దానం నాగేందర్ పరుషపదజాలం... ఆపై వివరణ

తాను సభలో మునుపెన్నడూ అలా మాట్లాడలేదన్న దానం నాగేందర్

తన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేసిన దానం నాగేందర్

వ్యాఖ్యలను పరిశీలించి అవసరమైతే రికార్డుల నుంచి తొలగిస్తానన్న స్పీకర్



హైదరాబాద్ నగరంలో అభివృద్ధి కార్యక్రమాలపై శాసనసభలో స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ అంశంపై దానం నాగేందర్ చర్చను ప్రారంభించారు. ఆయన మాట్లాడటంపై బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయనకు మాట్లాడేందుకు అవకాశమివ్వడంపై అభ్యంతరం తెలిపారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులపై దానం పరుషపదజాలం ఉపయోగించారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలిపారు. తన వ్యాఖ్యలపై దానం నాగేందర్ వివరణ ఇచ్చారు.తాను సభలో గతంలో ఎప్పుడూ ఇలా మాట్లాడలేదన్నారు. సభలో తాను సీనియర్ వ్యక్తిని అన్నారు. తాను చేసిన వ్యాఖ్యల పట్ల దానం విచారం వ్యక్తం చేశారు. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు చెప్పారు. తనను రెచ్చగొట్టారని, దీంతో తాను మాట్లాడవలసి వచ్చిందన్నారు. తన గురించి, తన పనితీరు గురించి అందరికీ తెలుసునన్నారు. అయినప్పటికీ తాను ఉపయోగించిన పదజాలం తెలంగాణలో మామూలే అన్నారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్... దానం వ్యాఖ్యలను పరిశీలించి అవసరమైతే రికార్డుల నుంచి తొలగిస్తామన్నారు.

# జులైలో 22 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు: టీటీడీ ఈఓ శ్యామలరావు

తిరుమల అన్నమయ్య భవనంలో 'డయల్ యువర్ ఈఓ' కార్యక్రమం

టీటీడీ అన్నప్రసాదాల్లో నాణ్యతపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు వెల్లడి

దళారీ వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్న టీటీడీ ఈఓ



తిరుమల అన్నమయ్య భవన్ లో టీటీడీ ఈఓ శ్యామలరావు 'డయల్ యువర్ ఈఓ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జులైలో 22 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారని తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా శ్రీవాణి దర్శన టికెట్లు పరిమితం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంకా ఈఓ మాట్లాడుతూ... తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అన్నప్రసాదాల్లో నాణ్యతపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. దళారీ వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. కాగా, ఇప్పటికే నాసిరకం నెయ్యి సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌ను టీటీడీ బ్లాక్ లిస్టులో పెట్టింది.
ఇక తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని ఆధునికీకరించాలని నిర్ణయించినట్లు చెప్పిన ఈఓ శ్యామలరావు... ఆ మేరకు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇదిలాఉంటే... గత ఐదేళ్ల వైసీపీ పాలనలో భక్తుల నుంచి వచ్చిన విమర్శలు పునరావృతం కాకుండా పూర్తిస్థాయి ప్రక్షాళనకు టీటీడీ కార్యాచరణ సిద్ధం చేసిందని ఈఓ శ్యామలరావు ఇటీవలే చెప్పారు.

## నిశాంక, వెల్లలాగే హాఫ్ సెంచరీలు..

# భారత్ లక్ష్యం ఎంతంటే..?



కొలంబో వేదికగా జరుగుతున్న తొలి వన్డేలో భారత్ బౌలింగ్ తో అదరగొట్టింది. ఆతిథ్య శ్రీలంకను తక్కువ స్కోర్ కే కట్టడి చేసి సత్తా చాటారు. అక్షర్ పటేల్.. కుల్దీప్ యాదవ్ లతో పాటు బౌలర్లందరూ సమిష్టిగా రాణించడంతో మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 230 పరుగులు మాత్రమే చేయగలిగింది. 66 పరుగులు చేసిన దునీత్ వెల్లలాగే టాప్ స్కోరర్ కాగా.. ఓపెనర్ నిస్సంక (56) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంకకు సిరాజ్ బిగ్ షాక్ ఇచ్చాడు. ఓపెనర్ ఆవిష్క ఫెర్నాండో ను ఒక పరుగుకే అవుట్ చేసి శుభారంభం ఇచ్చాడు. కుశాల్ మెండీస్(14), సుధీర సమర విక్రమ్ (8), అసలంక(14), లియాంగ్ (20) క్రీజ్ లో కుదురుకున్నట్టు కనిపించినా.. పరుగులు చేయడానికి ఇబ్బంది పడ్డారు. దీంతో శ్రీలంక వరుస విరామాల్లో వికెట్లను కోల్పోయింది. వికెట్లు పడుతున్న మరో ఎండ్ లో నిశాంక భారత బౌలర్లను సమర్ధవంతంగా ఎదుర్కొన్నాడు. అయితే వాషింగ్ టన్ ఒక అద్భుతమైన బంతితో నిశాంక ను పెవిలియన్ కు పంపించడంతో లంక జట్టు 101 పరుగులకే సగం జట్టును కోల్పోయింది.

ఈ దశలో శ్రీలంక 150 పరుగులు చేయడం కూడా కష్టంగా అనిపించింది. అయితే 21 ఏళ్ళ దునీత్ వెల్లలాగే అనూహ్యంగా పోరాడాడు. లోయర్ ఆర్డర్ లో

కీలక భాగస్వామ్యాలు నిర్మిస్తూ లంక జట్టు స్కోర్ ను 200 పరుగులు దాటించాడు. హసరంగా(24), అఖిల ధనుంజయ్ (17) లతో కలిసి హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. భారత బౌలర్లలో అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్ తలో రెండు వికెట్లు తీసుకోగా.. మహమ్మద్ సిరాజ్, దూబే, కుల్దీప్ యాదవ్, సుందర్ లకు తలో వికెట్ దక్కింది.

# మరో పతకానికి అడుగు దూరం.. ఫైనల్లో మను భాకర్

పారిస్ ఒలింపిక్స్‌లో భారత మహిళా షూటర్ మను భాకర్ మరో పతకం దిశగా అడుగులు వేసింది. శుక్రవారం జరిగిన మహిళల 25 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగం క్వాలిఫికేషన్‌లో మను ఫైనల్లో అడుగుపెట్టింది. 590 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. మొదటి ఎనిమిది మంది షూటర్లు ఫైనల్ చేరుకుంటారు. మను పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్ చేరడం ఇది మూడోసారి.అంతకుముందు మను భాకర్..10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్య పతకాలు సాధించింది. తద్వారా, ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారత ప్లేయర్‌గా, మహిళా షూటర్‌గా చరిత్ర సృష్టించింది. ఇప్పుడు ఆమె మూడోసారి ఫైనల్ చేరడంతో.. భారత్ ఖాతాలో మరో పతకం చేరడం ఖాయమన్న మాటలు వినపడుతున్నాయి. అదే జరిగితే, మను ఒక ఒలింపిక్స్‌లో హ్యాట్రిక్ పతకాలు సాధించిన భారత క్రీడాకారిణిగా అవతరిస్తుంది.కాగా, ఇదే విభాగంలో పోటీ పడిన మరో భారత షూటర్ ఇషా సింగ్ 581 పాయింట్లతో 18వ స్థానానికి పరిమితమైంది.



# నల్ల బ్యాడ్జి ధరించిన భారత ఆటగాళ్లు.. కారణం ఏంటంటే..?




కొలంబో వేదికగా భారత్, శ్రీలంక మధ్య తొలి వన్డే ప్రారంభమైంది. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచినా శ్రీలంక మొదట బ్యాటిగ్ చేస్తుంది. ఇదిలా ఉండగా.. ఈ మ్యాచ్ లో భారత టీమిండియా ఆటగాళ్లు నల్ల బ్యాడ్జీ ధరించి మైదానంలోకి దిగారు. భారత మాజీ క్రికెటర్, హెడ్ కోచ్ ఔన్షుమాన్ గైక్వాడ్ (71) క్యాన్సర్‌తో దీర్ఘకాలంగా పోరాడుతూ బుధవారం (జూలై 31) మరణించారు. ఇతనికి నివాళి అర్పించడానికి భారత క్రికెటర్లు మైదానంలో నల్ల బ్యాడ్జీలతో కనిపించారు. 'బుధవారం కన్నుమూసిన భారత మాజీ క్రికెటర్, కోచ్ అవున్షుమాన్ గైక్వాడ్ జ్ఞాపకార్థంగా టీమ్ ఇండియా ఈరోజు నల్ల బ్యాండ్‌లు ధరించింది' అని బీసీసీఐ ట్వీట్ చేసింది. గైక్వాడ్ ప్రస్తుత వయసు 71 సంవత్సరాలు. భారత్ తరపున 1974 నుంచి 1987 వరకు క్రికెట్ ఆడారు. 40 టెస్టుల్లో 29 యావరేజ్ తో 1985 పరుగులు చేశారు. అతని ఖాతాలో రెండు సెంచరీలు 10 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 15 వన్డేల్లో 20 యావరేజ్ తో 269 పరుగులు చేశారు. టెస్టుల్లో అత్యధిక స్కోర్ 201 కాగా.. వన్డేల్లో 78.

ఇక ఈ మ్యాచ్ విషయానికి వస్తే భారత్ 2024 లో తొలి వన్డే ఆడబోతుంది. 2023 వన్డే వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తొలి వన్డే ఆడుతుండడంతో అందరి దృష్టి వీరిపైనే నెలకొంది. ఈ మ్యాచ్ లో తుది జట్టులో రిషబ్ పంత్ కు చోటు లభించలేదు. ముగ్గురు ఆల్ రౌండర్లకు తుది జట్టులో స్థానం దక్కింది. అక్షర్ పటేల్, వాషింగ్ టన్ సుందర్ లతో పాటు దుబేకు ప్లేయింగ్ 11 లో చోటు దక్కింది. మరో వైపు శ్రీలంక తరపున ఫాస్ట్ బౌలర్ సిరాజ్ తొలి

చంపు! కియారా అద్వానీ బ్లూ డ్రెస్ ఫైర్



# అయ్యో శ్రీలీల.. మళ్లీనా?



టాలీవుడ్ ఇండస్ట్రీలోకి వచ్చిన తక్కువ టైమ్ లోనే మంచి గుర్తింపు సంపాదించుకుంది యంగ్ బ్యూటీ శ్రీలీల. పెళ్లి సందడి మూవీతో కుర్రాళ్ల మనసులు దోచుకుంది ఈ బ్యూటీ. ఆ తర్వాత రవితేజతో చేసిన ధమాకా మూవీ సూపర్ హిట్ కావడంతో వరుస ఆఫర్లు అందుకుంది. టాలీవుడ్ లో సెన్సేషన్ గా మారిపోయింది. కానీ కొద్దిరోజులుగా శ్రీలీలకు లక్ సరిగ్గా కలిసి రావడం లేదనే చెప్పాలి. గత ఏడాది నాలుగు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు శ్రీలీల రాగా.. అందులో మూడు చిత్రాలు డిజాస్టర్లుగా మిగిలాయి. భగవంత్ కేసరి మాత్రమే హిట్ అయింది. 2024లో సూపర్ స్టార్ మహేష్ బాబు గుంటూరు కారం మూవీతో థియేటర్లలోకి వచ్చింది. భారీ అంచనాల మధ్య రిలీజైన ఈ సినిమా.. మిక్స్ డ్ టాక్ అందుకుంది. దీంతో సినిమాలకు కొద్ది రోజులు బ్రేక్ ఇచ్చి స్టడీస్ పై ఫోకస్ పెట్టాలని ఫిక్స్ అయిందట శ్రీలీల.

ఈ నేపథ్యంలో పలు భారీ సినిమాల ఆఫర్లు వచ్చినా శ్రీలీల రిజెక్ట్ చేసిందని వార్తలు వచ్చాయి. కొన్ని నెలలుగా కొత్తగా ఒక్క సినిమాకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు ఈ బ్యూటీ. ప్రస్తుతం ఆమె చేతిలో పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ మాత్రమే ఉంది. విజయ్ దేవరకొండ మూవీ నుంచి ఆమెనే తప్పుకుంది. అయితే యంగ్ హీరో నితిన్.. రాబిన్ హుడ్ మూవీలో శ్రీలీలనే హీరోయిన్ గా నటిస్తుందని ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. ఎక్స్ ట్రా ఆర్డినరీ సినిమా టైమ్ లో కూడా నితిన్.. శ్రీలీలతో మరో మూవీ చేస్తున్నట్లు తెలిపారు. కానీ ఇప్పుడు రాబిన్ హుడ్ నుంచి ఆమెను తప్పించినట్లు టాక్ వినిపిస్తోంది. శ్రీలీలను రాశీ ఖన్నాతో రీప్లేస్ చేసినట్లు తెలుస్తోంది. ముందు ఈ ప్రాజెక్ట్ లో హీరోయిన్ గా రష్మిక మందన్న అనుకున్నారు. ఆమె తప్పుకోవడంతో శ్రీలీలను సెలెక్ట్ చేశారట. ఇప్పుడు ఈమెను తప్పించి రాశిని ఎంచుకున్నట్లు సమాచారం.

కానీ కొందరు ఈ సినిమాలో హీరోయిన్ గా శ్రీలీల నటించనుందని, రాశి కీలక పాత్ర పోషిస్తుందని చెబుతున్నారు. దీనిపై మేకర్స్ అధికారిక ప్రకటన ఇస్తేనే అసలు విషయం తెలుస్తుంది. ఇప్పటికే రాశీ ఖన్నా, నితిన్ శ్రీనివాస కళ్యాణం మూవీలో నటించగా.. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయింది. మరి రాబిన్ హుడ్ సినిమా విషయంలో వస్తున్న వార్తలు నిజమో కాదో తెలియాలంటే వేచి చూడాలి.

టిల్లూ స్క్వేర్ ఈవెంట్‌లో అనుపమ పరమేశ్వరన్ మెరిసింది



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com